రంగరంగేళి రాజీవ్ నగర్

రమణీయ దృశ్యాలు










10–4–1992 శుక్రవారం 14 పేజీలు సంపుటి :63 సంచిక :15 విడిప్రతి : రు. 1.50 లు

జమీన్‌రైతు


స్థాపకుడు : నెల్లూరు వెంకటరామానాయుడు








(ఫోటోల వివరాలు, వ్యాసం 5 పేజీలో)









గుంటూరు ఏఐసిసి సమావేశ సందర్భంలో ఎడమ వైపు చిత్రం : కుడినుండి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, కేంద్ర ఉక్కు మంత్రి నీలం సంజీవ రెడ్డి, ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి, కొండా నారప రెడ్డి, పిడతల రంగారెడ్డి (కెమెరాకు చాటుగా వున్న ముఖం) : కుడివైపు చిత్రం శ్రీ మతి ఇందిరా గాంధీకి స్వాగతం పలికిన బ్రహ్మానంద రెడ్డి సతీమణి శ్రీ మతి రాఘవమ్మ

సాదాసీదా హైదరాబాద్ ప్లీనరీ – ఆడంబరంగా గుంటూరు ఏఐసిసి

ఆంధ్రలోనే కాదు, బహుశా దేశంలో వివిధ ప్రదేశాలలో జరిగిన కాంగ్రెస్ మహాసభలన్నిటిలో చరిత్రలో నిల్చిపోయేంత బ్రహ్మాండంగా, గొప్పగా, దేశ విదేశ ఆహూతులకు అత్యద్భుత మనిపించేదిగా జరగబోతున్న తిరుపతి కాంగ్రెస్ మహాసభల సందర్భంలో గతంలో ప్రధానంగా స్వాతంత్ర్యానంతరం జరిగిన ఏ.ఐ.సి.సి. సమావేశం, కాంగ్రెస్ మహాసభలను గూర్చి కాస్త తెలిసికోవడం బాగుంటుంది.

దేశం స్వతంత్రమైన తర్వాత రాష్ట్రంలో ఒక ఏ.ఐ.సి.సి. సమావేశం, ఒక కాంగ్రెస్ మహాసభ జరిగాయి. అంతకు క్రితం పాత హైదరాబాదు రాష్ట్రంలో ఒక సారి కాంగ్రెస్ మహాసభ జరిగింది. స్వాతంత్ర్యం కనుచూపుమేరలో లేని కాలంలో, గాంధీజీ అప్పుడే కాంగ్రెస్ రాజకీయాలలో అడుగు పెట్టిన సమయంలో, లోకమాన్య బాలగంగాధర తిలక్ అస్తమించి నూతన నాయకత్వం ఆవిర్భవిస్తున్న సంధి సమయంలో, నెహ్రూ,పటేల్, బోస్ వంటి రెండవ తరం అగ్రనాయకులు రంగంలో ప్రవేశించిన అదునులో, మోతీలాల్, లజపతిరాయ్, చిత్తరంజన్ దాస్ వంటి తొలి తరం మహానాయకుల సారథ్యంలో వున్న రోజుల్లో 1921 ఏప్రిల్లో విజయవాడలో ఒకఏ.ఐ.సి.సి. సమావేశం జరిగింది. దాదాపు 43 ఏళ్ల అనంతరం, 1964 లో పండిట్ నెహ్రూ మరణానంతరం గుంటూరులో ఏ.ఐ.సి.సి. జరిగింది.అప్పుడు ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి. 1968 లో హైదరా బాదులో కాంగ్రెస్ మహాసభ – అంటే ప్లీనరీ – జరిగింది. అప్పుడు ప్రధాని శ్రీ మతి ఇందిరాగాంధీ. గుంటూరు సమావేశం, హైదరాబాదు మహాసభలు జరిగిన రెండు సమయాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి. ఇరవై మూడేళ్ల అనంతరం ఇప్పుడు ఏప్రెల్ 14 నుండి మహాసభ తిరుపతిలో జరుగబోతున్నది. తిరుపతి వచ్చే సరికి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు, ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్ధన రెడ్డి. గమనార్హమైన దురదృష్టం ఆంధ్రలో స్వాతంత్ర్యానంతరం జరిగిన ఏ.ఐ.సి.సి. లోగాని, హైదరా బాదులో జరిగిన ప్లీనరీలోగాని పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్ వంటి నాయకులు పాల్గొనక పోవడం; పాల్గొనక పోవడమే కాదు, సజీవులుగా లేకపోవడమే దురదృష్టకరం. వీటికి సంబంధించి గొప్ప వోషం కూడా లేకపోలేదు. అప్పటికి కాంగ్రెస్ చీలలేదు; సిద్ధాంత పరంగా, విధాన పరంగా వ్యక్తిగతంగా అభిప్రాయ భేదాలున్నప్పటికీ కాంగ్రెస్ నుండి ఒక్క నాయకుడూ బైటకు పోలేదు. స్వాతంత్ర్యోద్యమం నాటి సమైక్య కాంగ్రెస్ అది.

ఆంధ్రప్రదేశ్ రాకముందు హైదరా బాదు రాష్ట్రంలో స్వామి రామానంద తీర్థ రాష్ట్ర కాంగ్రెస్

కొరవ 6 వ పేజిలో



హైదరాబాదు కాంగ్రెస్ మహాసభలకు ప్రత్యేక రైలులో ప్రయాణం చేస్తూ మధ్యాహ్నం వెల్లూరు స్టేషన్లో విందు ఆరగిస్తున్న కొత్త–పాత కాంగ్రెస్ అధ్యక్షులు నిజలింగప్ప, కామరాజ్.

నాటి జ్ఞాపకాలు నేటి అనుభవాలు



హైదరాబాద్ 'విద్యానగర్' లో కొత్త కాంగ్రెస్ అధ్యక్షునికి స్వాగతం ఇస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చిత్రంలో గుల్జారిలాల్ నందా, గొట్టిపాటి బ్రహ్మయ్య, జగ్జీవన్ రాంలు కూడావున్నారు.

పినాకిని తీరం

తత్వం తప్పిన బ్రహ్మం!

'బ్రహ్మం' గారికి తత్వం తప్పిందా? వయోభారం వల్లనా? నిర్వ్యా పారత్వం వల్లనా? కన్ను కుట్టిందా? కడుపు మంటా ? అసూయా? ఎంత వుద్రేక సమయాల్లోనూ, ఎంత ఆవేశపూరితమైన పరిస్థితుల్లోనూ ఎంత రెచ్చగొట్ట ప్రయత్నించినా సంయమనాన్ని కోల్పోని శ్రీబ్రహ్మానంద రెడ్డి, మనసులో ఎంత ద్వేషభావం వున్నా మాటలలో కనిపించనివ్వని బ్రహ్మానంద రెడ్డి; జిల్లా కాంగ్రెస్ మొదలు జాతీయ కాంగ్రెస్ అధ్యక్షత వరకు, జిల్లా బోర్డు అధ్యక్షత నుండి దేశ హోం మంత్రిత్వం వరకు వివిధ హోదాలలో అసంఖ్యాకమైన పదవులు నిర్వహించి, అపారమైన అనుభవాన్ని గడించి, ఎంతోపరిణత మనస్కుడనే గౌరవ భావం కల్గించుకున్న శ్రీ బ్రహ్మానంద రెడ్డి సమయ సందర్భాలు లేకుండా పని గట్టుకొని ప్రధాని పి.వి. మీద అమాంతం విరుచుక పడడాన్ని చదివినప్పుడు బాధకలుగుతుంది. అసహ్యం వేస్తుంది. విహ్వలభావం ఏర్పడుతుంది.

నామినేషన్ సంస్కృతిలో కాంగ్రెస్ నాశనమైపోతున్నదనే ఆవేదన కొద్దీ వొతలు మరిచి మాట్లాడవలసి వచ్చిందా బ్రహ్మానంద రెడ్డి? 1970 దశకంలోనే అసలు కాంగ్రెస్ పోయిందనే విచారం కొద్దీ తిట్టవలసి వచ్చిందా? క్రింది స్థాయి నుండి పైస్థాయి వరకు కాంగ్రెస్లో ఎన్నికలు జరగడం లేదని కాంగ్రెస్ అంతరంగిక ప్రజాస్వామ్యం మీద వుండే పాత విలువల కొద్దీ నోటికొచ్చినట్లు దుయ్యబట్టవలసివచ్చిందా ? కోరు పదవులు కొత్తగా దిగుమతి అయ్యాయనే బెంగతో దులపవలసి వచ్చిందా?

కాంగ్రెస్లో నేడున్న దుర్గణాలు దుర్లక్షణాలు, అపసవ్యమార్గాలు ఈనాటి కీనాడు హఠాత్తుగా ప్రవేశించలేదు; నెహ్రూ పండితుని హయాంలోనే ప్రారంభమై క్రమానుగతంగా పెరిగి పెద్దవయ్యాయి. నాయకుల నిరంకుశ పోకడ ఈనాటిదా? ఒక వ్యక్తికే రెండు పదవుల పద్ధతి ఈనాటి దా ? డి.సి.సి.మొదలు ఎ.ఐ.సి.సి. సభ్యుల వరకు ఎలక్షన్ ప్రహసనం ఈనాటిదా? దొంగ సభ్యత్వం ఈనాటిదా? కుటుంబ పెత్తనం ఈ నాటిదా? బ్రహ్మానంద రెడ్డి గారు ఏకరువు పెట్టిన దుష్సాం ప్రదాయాలతో ఏది కొత్తది? నెహ్రూ అధికారంలో వుండగా అంత్యదశలో పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీలో కృష్ణమీనన్ గురించి హనుమంతయ్య నిలదీసిన సమయం వరకు నెహ్రూకు అడ్డు చెప్పిన వాడున్నాడా? సిండికేట్ తోక కత్తిరించిన తర్వాత ఇందిరాగాంధీ కాంగ్రెస్ అసలు కాంగ్రెస్ కాలేదా? సిండికేట్లోని అత్యధికులు ఆమెకు దాసులై పోలేదా? రాజీవ్ గాంధీని ప్రధానిని చేసింది వృద్ధ కాంగ్రెస్ వాదులు కాదా? ఆ పిల్ల నాయకునికి భృత్యాను భృత్యులుగా వుండినది వీరు కాదా? ఇంతెందుకు ఏ అధికారమూలేని సంజయ్ గాంధీకి బ్రహ్మరథం పట్టిన వారెవరు?

రాష్ట్ర స్థాయిలో మాత్రం నీలం సంజీవ రెడ్డి, దామోదరం సంజీవయ్య, బ్రహ్మానంద రెడ్డి, పి.వి., వెంగళ రావు, చెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకటరాం, విజయ భాస్కర రెడ్డి, ఈనాడు జనార్థన రెడ్డి – వీరి ముఖ్యమంత్రిత్వ హయాంలో వీరి మాట అడ్డు లేకుండా చెలామణి అయిపోవడం లేదా? నెహ్రూ – ఇందిరా గాంధీ – రాజీవ్ గాంధీ గార్ల నుండి సూచన రాగానే పార్టీలో బలం పెట్టుకొని బ్రహ్మానంద రెడ్డి వంటి హేమాహేమీలు గుట్టుచప్పుడు కా[illegible]గా దిగిపోలేదా?

కొరవ 7 పేజిలో

జమీన్‌రైతు

రాష్ట్రపతి అభ్యర్థి

రానున్న రాష్ట్రపతి ఎన్నికలలో అభ్యర్థి ఎవరు? జూలై 24 తేదితో ప్రస్తుత రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్ పదవీ కాలం ముగుస్తుంది. ఆలోగా ఎన్నిక జరిగి తీరాలి. అందుకే అన్ని పార్టీలూ ఈ విషయంపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి; చర్చలు జరుపుతున్నాయి. రాష్ట్రపతి ఎన్నిక పార్లమెంట్, శాసనసభ సభ్యులతో కలిసిన ఎలక్టోరల్ కాలేజితో నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు ఏ పార్టీకి ఈ ఎలక్టోరల్ కాలేజిలో మెజారిటీ లేదు. ఎవరూ స్వతంత్రంగా అభ్యర్థిని నిలబెట్టి గెల్పించుకొనే పరిస్థితిలో లేరు. ముఖాముఖి పోటీ ఏర్పడితే కాంగ్రెస్ లేకుండా ఏ ఇతర పార్టీలు, ఫ్రంట్‌లు ఏకమైనా గెలువడం అసాధ్యం; బిజెపి లేదా లెఫ్ట్‌ఫ్రంట్‌లలో ఒకదానిని కలుపుకోనిదే గెలవడం కాంగ్రెస్‌కు కూడా సాధ్యంకాదు. కాని, ప్రస్తుతమున్న పరిస్థితులలో ఈ కలయిక సాధ్యమా? బిజెపితో చేతులు కలపడం అంటే మత తత్వపార్టీలను ప్రోత్సహిస్తున్నారన్న నిందను కాంగ్రెస్‌మోయాలి. అయోధ్య తాజా పరిణామాల తర్వాత బిజెపితో పొత్తు కాంగ్రెస్‌కు శ్రేయోదా యకమన్పించదు. లెఫ్ట్ పార్టీలు కాంగ్రెస్ పట్ల శత్రుభావంతో వ్యవహరిస్తున్నాయి. పార్లమెంట్ లోపల , బయట పగవారిగానే వుంటున్నారు. రాష్ట్రపతి ఎన్నిక కోసం వారు కాంగ్రెస్‌తో భాయి, భాయి అనలేరు. ఈ అస్పష్టత, అయోమయ పరిస్థితులు రాష్ట్రపతి ఎన్నికను ఏ చిక్కు పరిస్థితికి నెడతాయోయన్న భయం కల్గుతుంది.

• ప్రధాని చెప్పినట్టు ఏకాభిప్రాయ సాధన ద్వారా రాష్ట్రపతి అభ్యర్థిత్వం ఖరారు చేయడం ఒకటే ప్రస్తుతమున్న మార్గాంతరం. దేశంలో అత్యున్నతమైన ఈ పదవికి జరిగే ఎన్నిక ఉద్రిక్తతలు , రాజకీయ ఎత్తులు జిత్తులతో కంటే ఏకాభిప్రాయంతో జరగడం దేశప్రతిష్ఠకు అవసరం.

కాబోయే అభ్యర్థి హరిజనుడై వుండాలన్న వాదం ఒకటి బలం పుంజు కొంటున్నది. రాష్ట్రపతి వంటి గౌరవనీయ పదవికి కూడా అభ్యర్థి ఎన్నికలో కులం, మతం, వర్గం వంటి ప్రస్తావనలు రావడం దురదృష్టకరమైనా -దేశ జనాభాలో అత్యధికులుగా వున్న బలహీన వర్గాల ప్రజల మనోగతం పరిగణనకు తీసుకోవడం మంచిదే. పార్లమెంట్, శాసన సభలలోని మొత్తం హరిజన , గిరిజన సభ్యుల సంఖ్య కూడితే, ఎలక్టోరల్ కాలేజిలో 25శాతం ఓట్లు వారివే అవుతాయి. వెనుకబడిన తరగతులవారిని కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ఓట్లలో ఇంతటి ఆధిక్యత కల్గిన వర్గాలనుంచి ఒకసారి అభ్యర్థి ఎంపిక జరగాలనడం సమంజసమైన కోరిక!ఇప్పటి వరకు రాష్ట్రపతులైన వారందరు అగ్రవర్ణాలకు చెందిన వారుకావడం ఇక్కడ గమనార్హం. ఒక హరిజనుడు రాష్ట్రపతి అయినంత మాత్రాన దేశంలోని కోట్లాది హరిజనులకు జరిగే మేలు ఏదీ లేదు. వేల సంఖ్యలో హరిజన నాయకులు ఎమ్మెల్యేలుగా, ఎమ్పీలుగా, మంత్రులుగా , కేంద్ర మంత్రులుగా, కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా ఎన్నికౌతున్నా హరిజనులకు సాంఘిక , ఆర్థిక పరిస్థితులలో విప్లవాత్మక మార్పు లేవీ రావడం లేదు. ఎన్ని కాలేజీలు పెట్టినా, హాస్టళ్ళు తెరచినా, రిజర్వేషన్లు కల్పించినా 90శాతం హరిజన, గిరిజనులు నిరక్షరాస్యులుగా, వ్యవసాయ కూలీలుగా వుండిపోతున్నారే తప్ప, సమాజంలో గౌరవప్రద స్థానంలోకి చేరుకోలేదు. తరతరాలు నిర్దాక్షిణ్యంగా అణచి వేతకు గురైన వర్గాలవి. తూతూ మంత్రాలతో ఆ భయంకర శాపం నుంచి బయటపడలేరు. ఇప్పటి రాష్ట్రపతి ఎన్నికలో వారినుంచి అభ్యర్థిగా ఎంపికైనా వారి పరిస్థితులేమీ మారవు. దేశంలోని అత్యున్నత పదవికి తమవాడు అర్హుడయ్యాడన్న ఆత్మసంతృప్తి ఒకటే మిగులుతుంది. వారికి ఆ మానసిక ఆనందం కల్గించడంలో తప్పులేదు.

అయితే కేవలం హరిజనుడ్నే ఎంపిక చేయాలనే లక్ష్యంతో కాకుండా, ఈ అత్యున్నత పదవికి ఎంపిక చేసేందుకు అర్హతలు కల్గిన వారిలో హరిజనులూ వుంటే పరిశీలించడం తగిన పద్ధతి . దేశంలో ప్రస్తుతమున్న రాజకీయ అస్తవ్యస్థతలో రాష్ట్రపతిగా ఎన్నికయ్యే వారు అత్యుత్తమ గుణాలు కల్గివుండాలి. హుందాగా ప్రవర్తించాలి. దేశహితం తప్ప తక్కిన ప్రయోజనాలన్నీ ప్రక్కన బెట్టగల్గిన వాడు కావాలి. విదేశాలలో దేశ ప్రతిష్ఠను ఇనుమడింప జేయగల్గాలి. పార్లమెంట్‌లో ఏపార్టీకి మెజారిటీ లేని ప్రస్తుత పరిస్థితులలో ఏ క్షణాలలో నైనా ప్రభుత్వాలు అస్థిరత్వానికి లోనుకావచ్చు. అటువంటి క్లిష్టసమయాలెదురైతే నిబ్బరం కోల్పోక , సంయమనం పాటించి, దేశానికి ప్రజలకు ఏదిమేలో భావించి, స్వతంత్రంగా నిర్ణయం తీసుకోగల సామర్థ్యం వుండాలి.

ఇవన్నీ వున్నవాడే రాష్ట్రపతి పదవికి అర్హుడు. ఏకాభిప్రాయం ద్వారా కాని, కలయికలు పొత్తుల ద్వారా కాని ఎన్నికల బరిలో దిగే పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికలో ఈ అర్హతలన్నీ పరిగణనకు తీసుకోవడం అవసరం.

జమీన్‌రైతు

10.4.1942

8 పేజీలు అణా

50 ఏళ్ళ క్రితం ఈ వారం

విశాఖపట్నం, కాకినాడమీద బాంబులు

విశాఖపట్నంలో 5 గురు చనిపోయిరి. 40 మంది గాయపడిరి.

కాకినాడలో 1రు చనిపోయిరి, 4గురికి గాయాలు

తుదకు ప్రపంచ యుద్ధ జ్వాలలు భరత భూమిలో కూడా కాలు బెట్టినవి. మార్చి 13 తేదిన అండమానులనుండి బ్రిటీషు ప్రభుత్వము వారు ఖాళీ చెయ్యడమూ, 23 తేదిన ఈ దీవులు, నికోబారు ద్వీపములు జపాను వారి స్వాధీనము బనవి.

ఇంతటితో ఇండియా యుద్ధ రంగంగా మారిందనవచ్చును.

ఇండియాలో యుద్ధదేవత ఆంధ్రదేశంలోనే మొదట రోషరూక్ష నాలను బరపింది. ఆమెకు మనమేమి అపకారం జేశామో?

తూర్పు సముద్రంలో 6 తేదినుండి శత్రునావలు కనబడుతున్నవి. విశాఖపట్నం మీద 6తేది ఉదయమొక దాడియును, సాయంత్రమొక దాడియును జరిగినవి. మొదటి దాడి 1.30 కి ప్రారంభమైంది. రెండవది సా.5 గంటలకు జరిగింది. ఒక్కొక్కసారికి 10 విమానములకు పైన రాలేదు. 20బాంబులు పడినవి. అవి హార్బరువద్ద రాకు లోనే పడినవి. కొంత నష్టము కలిగినది. 40 మందికి గాయములు తగిలినవి. 5గురు చనిపోయిరి.

కాకినాడ.

కాకినాడలో మొదటి దాడి ఉదయం 7గంటలకు జరిగినది. కోరమాండల్ కంపెనీవారి స్టీములాంచి ఒకటి మరొక ఓడను గొనివచ్చుచుండగా యీ రెండు ఓడలను విమానమునుండి ఫిరంగి గుండ్లతో కాల్చినది - ఒకడు చని పోయినాడు. నలుగురికి దెబ్బలు తగిలినవి.

మధ్యాహ్నం 1-45లకు రెండవదాడి జరిగింది. 5విమానములు పాల్గొన్నవి. కిర్సనాయిల్ టాంకుమీద దాడులు జరిగినవి. ప్రాణనష్టం లేదు. తిరుగా 4గంటలకు విమానదాడి హెచ్చరిక జరిగింది గానీ దాడి జరుగలేదు.

విశాఖపట్నంలో గానీ, కాకినాడలో గానీ, నగరమునకేలాటి అప్కాయమునూ జరుగలేదు.

నెల్లూరు ఉత్సవాలు

దేవుడి నెత్తిన పెంటముంతలు గొట్టుట.

ఇద్దరు ముస్లిముల అరెస్టు.

గత 29 ది నుండి హిందువుల డిక్రీప్రకారం మసీదులముందుగా మేళములు వాయించు కుంటూ ఉత్సవములు జరిగినవి. మూలపేట వేణుగోపాల స్వామి వారి ఉత్సవములు 29,31,1,2,5తేదులలో జరిగినవి. 1దిన మూలస్థానేశ్వరుని చిత్రోత్సవము జరిగినది, ఈ ఉత్సవం బజారు గుండా శిఖరం వారివీధిలో వుండే జుమ్మామసీదు మీదుగా వెళ్ళింది. రాయాజీ వీధి అంజనే యోత్సవం బారకాసులోని మసీదు మీదుగా వెళ్ళింది.

5వ తేది జరిగిన వేణుగోపాలస్వామి ఉత్సవం సాయంత్రం పత్రేఖాసేటమీదుగా పోవు చుండినపుడు, పోలీసులైనుందు వీధిలో స్వామివారు దాటిపోయిన వెనుక పెంటముంత ఒకటి ప్రజలపైన పడ్డది. రిజర్వువారును, ఎ.డి.యస్.: గారు అయింటిలోకి చుపుగా ఒకడు అమేధ్యపు చెయ్యి కడుగుకొనుచుండెను. అతనిని అతనితో కూడా వుండిన మరొకరిని అరెస్టు చేసిరి. 295,296 సెక్షనులక్రింద రిమాండుచేసిరి.

ఆత్మకూరు బస్టాండు గతి ఇంతేనా ?

ఆత్మకూరు బస్టాండులో బస్సుల రద్దీ పెరిగిపోయింది. ఆర్‌టిసి బస్‌లన్నీ ఖచ్చితంగా అక్కడ ఆగుతున్నాయి. పెన్న అవతల గ్రామాలన్నిటికి ఈ బస్టాండు నుంచే బస్‌లు నడుపుతున్నారు. మైపాడు, కోడూరు రోడ్ల లోని గ్రామాలకు ఇక్కడి నుంచే బస్‌లు నడుస్తున్నాయి. అందువల్ల బస్టాండు ఎప్పుడూ వేలాది ప్రయాణీకులతో కిటకిటలాడుతుంటుంది. కాని బస్టాండులో తలదాచుకొను నీడ, త్రాగే నీరు లేవు. మరుగు దొడ్లు లేవు. మూత్రశాలలు లేవు. నిప్పులు చెరిగే ఎండలో నెత్తిపైన చేతిగుడ్డ కప్పుకొని నిలబడవలసి వస్తున్నది. వడదెబ్బకు గురి కావలసి వస్తున్నది. ఆడవాళ్ల పరిస్థితి మరీ అధ్వాన్నం. ఎండలో వారి పరిస్థితి జాలి కల్గిస్తుంది. పసిబిడ్డల్ని ఎండబారి నుంచి తప్పించడానికి వారు పడే పాట్లు అన్నిన్ని కావు. అంగళ్ళ దగ్గర నిలబడబోతే, వారికి వ్యాపారం ఇవ్వకుంటే కసురుకుంటారు. కూల్‌డ్రింక్‌లు, బేకరి సామాన్లు కొనగల్గె సామర్థ్యం ఎందరి కుంటుంది.?

రమేష్ రెడ్డిగారు ఛైర్మెన్ అయిన వెంటనే ఆత్మకూరు బస్టాండును అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. కానిఐదేళ్లుగడచి, పదవి నుంచి దిగిపోయే వరకు ఆ సంగతి పట్టించుకొనే తీరిక ఆయనకు దొరక లేదు. బొన్ బస్ స్టాప్‌లకు కూగా బస్ షెల్టర్లు కడుతున్నారు కాని, రోజు ఐదారు వేల మంది నిలబడే బస్టాండు సంగతి ఎవరూ పట్టించు కోక పోవడం దురదృష్టకరం. కలెక్టర్ గారు చొరవ తీసుకొని తక్షణం ఈ బస్టాండులో ప్రయాణీకులకు షెల్టర్లు మంచి నీటి వసతి కల్పించాలని మనవి.

— బి. పట్టాభిరామయ్య

నెల్లూరు.

జనవాణి

పోలీస్ స్టేషన్ భవనానికి పాట్లు

బాలాజీనగర్‌కు పోలీస్ స్టేషన్ మంజూరైంది. ఎస్.పి. భూపతి బాబు గారు మా నగరాల పౌరులను దొంగల బారి నుంచి తప్పించడానికి కష్టపడి స్టేషన్ మంజూరు చేయించి నట్లున్నారు. కాని, ఈ స్టేషన్ పెట్టడానికి బాలాజీనగర్ మొత్తం మీద బాడుగకు భవనం ఇచ్చే వారు కన్పించడం లేదు. బాడుగగు బిల్డింగ్ ఇవ్వకుంటే వచ్చిన అవకాశం జారిపోతుందని మైకు పెట్టి వీధి వీధిలో అనౌన్సు చేసినా ఎవరూ ముందుకు రావడం లేదు. ఎందువల్ల ఈ పరిస్థితి? పోలీసులంటే ప్రజలు ఎందుకు అంత భయపడుతున్నారు.? దొంగల భయం నుంచో, రౌడీల బాధ నుంచో రక్షణ పొందాలనుకునే వారు ముందు పరుగెత్తేది పోలీసు స్టేషన్‌కు; కాని అదే పోలీసు స్టేషన్ భవనం తమ ఇంట్లో పెట్టించడానికి అందరూ భయపడు తున్నారు. పోలీసు శాఖ పట్ల ప్రజలలో వున్న అభిప్రాయానికి ఈ పరిస్థితి అర్థం పడుతుంది.

ఎవరో ఒక ఇంటి యజమాని సాహసించి, బాలాజీనగర్ రక్షణకు సహకరించడం అవసరం; అందుకు పోలీసు అధికారుల నుంచి స్పష్టమైన హామీలు వుంటేనే వీలౌతుంది.

నెల్లూరు. —ఎస్వీఎస్కొటేశ్వర రావు

షేర్ మార్కెట్ ఓ మాయాజూదం — మోజు మితిమీరితే సర్వనాశనం !

కంపెనీల ఆర్థిక పరిస్థితులు, సమస్యలు, చిక్కులు, ఏవి అంశాలు ధరలను ప్రభావితం చేస్తాయి, ఎవరెవరు ఎన్నెన్ని మోసాలు చేస్తారు అన్న పరిజ్ఞానం లేకుండానే అమాయకంగా షేర్లు కొంటున్నారు. లాటరీ టిక్కెట్ల మాదిరి భావిస్తున్నారు. జాగ్రత్త పడకుంటే జీవితంలో కోలుకోలేని దెబ్బ తింటారు !

దేశంలో షేర్ల వ్యామోహం రాను రాను అపరిమితంగా పెరిగిపోతూంది. బొంబాయి వంటి నగరాలలోని బడా పారిశ్రామిక వేత్తలకు పరిమితమైన స్టాక్ ఎక్చేంజిలు, గ్రామీణ రైతాంగానికి చేరువౌతున్నాయి. నిన్నటి వరకు షేర్ అనే పదానికి అర్థమే తెలియని మధ్యతరగతి వ్యాపార, ఉద్యోగ వర్గాల ప్రజలు నిత్యం షేర్లతో వ్యాపారం చేస్తున్నారు. దాన్ని వ్యాపారం స్థాయి నుంచి వ్యామోహం స్థాయికి దించి ఒక విధమైన ఉన్మాదంలో పడిపోతున్నారు. రాత్రికి రాత్రి లక్షాధికారులు కావడానికి దగ్గర దారి అనే భ్రమలో మునిగిపోతున్నారు. కిల్లీకొట్టు వాలా, చిల్లరంగడి వ్యాపారి, ఆఫీసు గుమాస్తా, ట్యాక్సీ ఓనరు, ఇంటి ఇల్లాలు హై స్కూలు టీచరు — ఒకరేమిటి; మధ్యతరగతి వర్గాలలో షేర్ల పట్ల ఆసక్తి, అత్యంత అపరిమితంగా, పట్టపగ్గాలు లేకుండా పెరిగిపోతున్నాయి.

ఆరవయ్యేళ్ల క్రితం ధీరూభాయి అంబాని రంగ ప్రవేశం చేసే నాటికి షేర్‌మార్కెట్‌కు సాధారణ ప్రజానీకంతో సంపర్కమే లేదు. చాలా కొద్ది కంపెనీలు మాత్రమే పబ్లిక్ ఇష్యూలు విడుదల చేసేవి. వాటిని తమకు, తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పరిమితం చేసే వారు. షేర్ హోల్డర్ల సంఖ్య పెరిగితే కంపెనీల ఆధిపత్యం తమ చేతి నుంచి జారిపోతుందని భయపడే వారు. ఆ పరిస్థితులలో రిలయన్స్ పబ్లిక్ ఇష్యూల ద్వారా షేర్ల రుచిని మధ్యతరగతికి రుచి చూపించి, తన వ్యాపార సామ్రాజ్యాన్ని అపారంగా విస్తరించుకున్నారు అంబాని. ఆయన చూపించిన మార్గంలోనే తర్వాత తర్వాత చాలా కంపెనీలు నిధుల కోసం బ్యాంకుల చుట్టూ తిరగకుండా ప్రజల నుంచి షేర్ల రూపంలో వడ్డీలేని పెట్టుబడులు సేకరించడం మొదలు పెట్టాయి. రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో క్రమక్రమంగా సంభవించిన ఈ పరిణామం — గత రెండేళ్లలో విప్లవ రూపం ధరించింది. మరీ ఈ రెండు మూడు నెలల నుంచి మన్‌మోహన్ సింగ్ బడ్జెట్ పుణ్యమా అని అణుబాంబు వలె విస్ఫోటనం చెందింది. నగరాల నుంచి పట్టణాలకు, అక్కడి నుంచి పల్లెలకు కార్చిచ్చు వలె వ్యాపించి పోయింది — షేర్ వ్యామోహం. మార్చి 15 తేది నాటికి దేశంలో షేర్ల పై పెట్టిన పెట్టుబడి వాటికున్న విలువ రెండు లక్షలా ఇరవై ఐదువేల కోట్లు. విడ్డూరమైన విషయమేమిటంటే — ఈ ఏడాది జనవరిలో వీటి విలువ కేవలం 60 వేల కోట్లు మాత్రమే. రెండంటే రెండు నెలల్లో లక్షా 65 వేల కోట్ల అదనపు ఆదాయం — అవి కాగితం పైది కాని, నిజంగా డబ్బు చేతికంది కాని — సంపాదించారు షేర్ హోల్డర్లు. ఇంకా కళ్ళు తిరిగే పరిణామమేమిటంటే మార్చి 15 నుంచి 30 తేది లోపల, పదిహేను రోజుల్లో షేర్ల విలువ మరొక 50 వేల కోట్లు పెరిగింది.

ప్రపంచంలో మరే దేశంలోనూ, మరే సమయంలోనూ షేర్ విలువలు ఇంతగా పెరగలేదు; ఇంత పిచ్చి ఏ దేశ చరిత్రలోనూ కన్పించదు. 1991 లో కంపెనీలు సంపాదించిన లాభాలతో పోలిస్తే దాదాపు 50 రెట్లు అదనపు రేటు పలుకుతున్నాయి షేర్ల ధరలు. ఆయా కంపెనీలు అదే స్థాయిలో ప్రతి ఏటా లాభాలు సంపాదించినా, ఇప్పుడు ప్రజలు వేలం వెర్రిగా ఎగబడి కొంటున్న ధర గిట్టుబాటు కావాలంటే కనీసం 45 సంవత్సరాలు పడుతుంది. అయినా ప్రజలు షేర్లు కొనడంలో వెనుకడుగు వేయడం లేదు. విచక్షణ పాటించడం లేదు. షేర్ల ధరలు చుక్కలను తాకడం మానడం లేదు. ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, అహమ్మదాబాద్ స్టాక్ ఎక్చేంజి నిర్వాహకులు అత్యవసర సమావేశాలు జరిపి, కంపెనీలకు వచ్చే లాభాలకు, షేర్ల ధరలకు పొంతనే కన్పించడం లేదని, ప్రజలు అప్రమత్తులై ఈ వ్యామోహం మానుకోవాలని బహిరంగ హెచ్చరిక చేసినా — ధరల పెరుగుదల మరింత పెరిగిందే తప్ప, తగ్గడం లేదు.

పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల తీరు తెన్నులు, వాటి నిర్వహణ లోని సాధక బాధకాలు, లొసుపాట్లు, వివిధ పరిశ్రమలు వివిధ పరిస్థితులలో ఎదుర్కొనే ఒడిదుడుకులు, నిర్వాహకుల సమర్థత, రాజకీయ ప్రభావాలు తదితరాలు వేటి పై కూడా కనీస పరిజ్ఞానం, విచక్షణ లేని నూతన వర్గం ప్రజలు షేర్‌మార్కెట్‌లో ప్రవేశించడమే ఈ అనూహిత, ప్రమాదకర ధరల పెరుగుదలకు కారణం. ఆర్థిక రంగంలో ఇటీవల వచ్చిన మార్పులూ ఈ పరిస్థితిని ప్రేరేపించాయి. బంగారు ధర అస్తవ్యస్తం కావడం మధ్యతరగతి వర్గాలలో అనిశ్చిత స్థితిని సృష్టించింది. ఇది వరకు తమ చిన్నచిన్న పొదుపు మొత్తాలను వీరు బంగారు రూపంలో దాచుకొనేవారు. బ్యాంకు డిపాజిట్లు ఆకర్షణను కోల్పోయాయి. వడ్డీ పై ఇన్‌కంట్యాక్స్ అన్నభయం గ్రామీణులను కలవర పరచింది. ద్రవ్యోల్బణం వల్ల రూపాయి విలువ పడి పోవడంతో డబ్బు ఇంట్లో దాచుకోవడం వృథా అని అందరూ తెలుసుకున్నారు. స్వంత వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు మధ్య తరగతి వారికి అందుబాటు కాకుండా పోతున్నాయి. ఈ పరిస్థితులలో తగిన పెట్టుబడికి వారు చేసిన అన్వేషణ ఫలితమే షేర్ మార్కెట్! షేర్ల పై సంపద పన్ను రద్దు చేయడం, క్యాపిటల్

కొరవ 10 పేజిలో

దళితులకు కలెక్టర్ సలహా

సభలు పెడితే చాలదు — సంఘటిత పరిశ్రమ కావాలి!

దళిత వర్గాల ప్రజలు తమ జీవితాల మెరుగుదలకు, సాంఘిక న్యాయం సాధనకు సభలు సమావేశాలు జరుపుకోవడం కాక సంఘటితులై పరిశ్రమించాలని కలెక్టర్ శ్రీ కె.రాజు కోరారు. 5 తేది సాయంత్రం టౌన్ హాల్‌లో జరిగిన బాబూ జగజ్జీవన్ రాం 85 జయంతి సభలో ప్రసంగిస్తూ దళితులపై అత్యాచారం జరిపే వారికి సింహస్వప్నంగా వుండిన వాడని జోహార్లర్పించారు. దళిత ప్రజానీకం ఇంకా దయనీయ పరిస్థితులలో వుండడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, దళిత విద్యావంతులు తాము ఏ సమాజం నుంచి వచ్చింది మరవరాదని, దళితులకు ప్రభుత్వం చేస్తున్న సహాయం, తరతరాలుగా వారి నుంచి పొందిన సేవలకు చెల్లించే రుణం తప్ప, దయాదాక్షిణ్యాలతో చేసేది కాదని

నెల్లూరు సంగతులు

అన్నారు శ్రీ కె. రాజు.

ఎమ్పీ కుమారి కె. పద్మశ్రీ, ఎమ్మెల్యేలు శ్రీ జి.కె.రెడ్డి, శ్రీ పట్బాప్రకాశ రావు, దళిత నాయకులు శ్రీ చెంచు రామయ్య, శ్రీ పి. విజయం, శ్రీ డి. పరంధామయ్య, శ్రీ పి. చెంగయ్య శ్రీ తేరి రాయప్ప తదితరులు మాట్లాడారు.

గిడ్డంగి వీధి రోడ్డు బాగుచేయకుంటే దీక్ష

చిన్న బజారు పద్మవ్యూహంలో ఒకటైన గిడ్డంగి వీధి రోడ్డును రిపేరు చేయకుంటే అమరణ దీక్ష చేస్తానని మాజీ మునిసిపల్ కౌన్సిలర్ శ్రీ ఆనందాచారి హెచ్చరిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఇదే సమస్య పై ఆనందాచారి నిరాహార దీక్ష చేశారు. కమీషనర్ ఇచ్చిన హామీతో విరమించుకున్నారు. అయితే ఆ హామీ అట్లనే వుండి పోయింది. టెలిఫోన్ శాఖ పుణ్యమా అని రోడ్డు మరింత చండాలంగా తయారైంది. 1975 నుంచి ఈ రోడ్డు పైన తట్టెడు కంకర క్రుమ్మరించిన పాపాన పోలేదట. అందుకే ఆనందాచారి దీక్ష.

రోడ్డు రిపేరుకు కూడా ఆమరణ దీక్ష అంటే సత్యాగ్రహం మరీ చులకనై పోతున్నది; అంతటి తీవ్ర హెచ్చరికలు చేయనిదే అధికారులలో చలనం రావడం లేదు. కమీషనర్ గారు ఈ సమస్యను అంత దూరం సాగ దియ్యరని భావిద్దాం!

ఉగాది రోజున సంగీతావధానం

ఉగాది సందర్భంగా రాయాజీ వీధి ఆంజనేయస్వామి దేవాలయంలో శారద సాహితీ సంస్థ తరపున పంచాంగ శ్రవణం, కవి సన్మానాలు, సంగీతావధానం జరిగాయి. శ్రీ ని

కొరవ 10 పేజిలో



ఆవేదనలు — అంతరంగాలు !

సాహిత్య ప్రక్రియలలో కవిత్వం తర్వాత అంతటి స్థానం 'కథ' కున్నది. కథలంటే చెవి కోసుకొని వారూ, మంచి కథను చదివి స్పందించని వారూ అరుదుగా ఉంటారు. తెలుగు సాహిత్యంలో కథలు ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాయి.

కథానిక యూరప్‌లో ఆవిర్భ వించిందని పరిశోధకులు చెబుతున్నప్పటికీ కథానికా సాహిత్యాన్ని పరిశీలించి నట్లయితే తెలుగు, సంస్కృత, ప్రాకృతం

కొరవ 10 పేజిలో

వైష్ణవమాయకూ ఇంతటి మహత్తు వుండదు!

కోట్లు చిత్తునోట్లుగా ఖర్చయినా కాంగ్రెస్ చరిత్రలో కలకాలం నిల్చిపోయే కమనీయ రూపకల్పన

రంగ రంగ వైభవమంటే ఇదే కాబోలు – అన్నారొకరు!

నభూతో నభవిష్యతి అన్న మాత్రకి నిర్వచనం అదేనన్నారు ఇంకొకరు!

కలయా, వైష్ణవ మాయయా తెలియడం లేదని కలవర పడ్డారు కొందరు!

తిరుపతి రాజీవ్ నగర్ సందర్శనార్థం వచ్చి వింత ప్రపంచంలో తిరుగుతున్నామన్న అనుభూతికి లోనైన జన సమూహపు వెలవరింతలివి!

ముఖ్యమంత్రి శ్రీ ఎన్.జనార్దన రెడ్డి దగ్గర అల్లాఉద్దీన్ అద్భుత దీపమేదైనా వుందో; లేక మాగుంట సుబ్బరామిరెడ్డి గారి దివాణం నిసా దిరదా తియ్యగానే సాక్షాత్కరించే కాశీమజిలీ కథల కాలం

> **ముఖ్యమంత్రి, మాగుంట ద్వయం అల్లాఉద్దీన్ అద్భుత దీపమేదో ప్రయోగించినట్లుంది తప్ప మానవమాత్రులు శ్రమించి తీర్చిదిద్దినట్లు లేదు – రాజీవ్ నగర్**

ఇంద్రుడి విశ్వకర్మ క్రిందకు దిగివస్తే తన కళాప్రావీణ్యం ఎంత అల్పమైనదో తెల్సుకొని సిగ్గుపడడం ఖాయమని అభిప్రాయపడ్డారు ఇంకొందరు.

రాత్రికి పగలుకు తేడా తెలియని రీతిలో రాకెట్ స్పీడుతో నిర్మితమౌతున్న

నాటి పని రాక్షసుడెవరైనా వున్నాకో తెలియదు కాని – కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల ఏర్పాట్లతో ముస్తాబౌతున్న రాజీవ్ నగర్ మాత్రం ఎంతటి వారికీ నోటమాట రాకుండా చేస్తుంది. రాజాతల్పుకుంటే కానిదేముందనే సామెత వున్నా– మనిషన్న వాడికి ఇది సాధ్యమా

అన్న సంశయం ఎవరికైనా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

మార్చి 5 తేది, తిరుపతిలో కాంగ్రెస్ సభలు జరుగుతాయని ప్రకటించినపుడు, అవిలాల చెరువును చూసిన వారు, ఇప్పుడు దాని రూపం చూస్తే మూర్ఛపోతారు. దట్టంగా, మనిషి దూరడానికి సందులేని రీతిలో కరతుమ్మ అడవి, దాదాపు ఐదు కిలోమీటర్ల పొడవు కల్గిన పెద్ద కట్ట తప్ప ఇంకేమీ లేవు. ఆ స్మశాన వాటికను శోభనప్పెగిలాగా

> **రాజీవ్‌నగర్‌లో మా విలేఖరి స్వప్న విహారం**

అలంకరించడం వెనుక ఎందరి కృషి, శ్రమ, ఎంతటి వ్యయప్రయాసలు వున్నాయో చెప్పలేము. అందులోనూ వ్యవధి తక్కువ. స్థల నిర్ణయం చేసిన నాటికి, సమావేశపు తేదికి మధ్య వ్యవధి కేవలం 40 రోజులు. తలపెట్టిన ఏర్పాట్లేమో మయసభా నిర్మాణమంతటి విస్తృతమైనవి. గోవింద రావు వంటి ఆర్కిటెక్ట్‌లు, తోటధరణి వంటి కళాకారులు, రూపకల్పన చేసిన

సమూనాలో సమావేశ వరణం తయారు కావాలి. ఇంకొకరు ఇంకొకరు అయితే అది అసాధ్యమని చేతులెత్తేసి వుందురు. కాని ముఖ్యమంత్రి శ్రీ జనార్దన రెడ్డి ఆత్మవిశ్వాసం మాగుంట సుబ్బరామ రెడ్డి

తీరులో సభావరణాన్ని తీర్చిదిద్దాం.

104 ఏళ్ళ కాంగ్రెస్ చరిత్రలో ఇంతటి భారీ ఎత్తున ఎప్పుడూ, ఏ ప్లీనరీ జరిగివుండదు; ఇక ముందు జరుగబోదు కూడా! కాంగ్రెస్ మహాసభలను

రమణీయ దృశ్యాల వివరం

1. సర్వాలంకార శోభిత మహారాజప్రాసాదం వలె, ఆంధ్ర సంస్కృతీ శిల్ప సాంప్రదాయాలను స్ఫురణకు తెస్తూ, కళకు ప్రతి రూపంగా ముస్తాబైన రాజీవ్ నగర్ ప్రధాన స్వాగత తోరణం.
2. సజీవ శిల్పమా అని సందేహించ వలసినంత శోభతో ఆహూతులను స్వాగతించనున్న తెలుగుతల్లి ప్రతిరూపం.
3. చిత్రకారుల కుంచెలలో ప్రాణం పోసుకొంటున్న గతించిన మహానాయకుల కటౌట్లు.
4. దీపపు స్తంభాలలోనూ కళాత్మకత
5. ఎర్రటి ఎండలో నిలబడి లారీలకు మట్టి నెత్తిస్తున్న మాగుంట.
6. పంచ పై కెగట్టి సభావరణంలో పనులను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి జనార్దన రెడ్డి, మాగుంట సుబ్బరామ రెడ్డి
7. తిరుపతి రహదారులకు పెండ్లి కళతేనున్న అసంఖ్యాక స్వాగత ద్వారాలలో ఒకటి.
8. ప్రధాన వేదికకు ఎయిర్ కండిషన్ గొట్టాలు బిగిస్తున్న దృశ్యం.
9. మార్చి 5 నాటి అవిలాల చెరువు అడవి దృశ్యం; ఏప్రెల్ 5 తేదికి అడవి ఆనవాళ్లు లేవు; 9తేది ఉదయానికి అదే అడవిలో అత్యద్భుతంగా రూపుదిద్దుకొన్న ప్లీనరీ పెండ్లి పందిరి

కార్యదక్షత ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాయి. కాంగ్రెస్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో, కలకాలం నిల్చిపోయే నిర్వహించే అరుదైన, అపురూపమైన అద్భుత అవకాశాన్ని ముఖ్యమంత్రి

కొరవ 6 వ పేజీలో

కావలి టెలిఫోన్ దొంగలు దొరికినా దొరలుగానే వున్నారు!

కావలి టెలిఫోన్ ఎక్ఛేంజిలో బయటపడిన ఒక పెద్ద కుంభకోణాన్ని అధికారులే కప్పిపెట్ట జూస్తున్నట్లు తెలుస్తున్నది. కావలి వ్యాపారులు, మరీ ముఖ్యంగా క్లాత్ మర్చంట్స్ దేశంలోని వివిధ ప్రాంతాల వర్తకులతో నిత్యం టెలిఫోన్ సంభాషణలు జరుపుతుంటారు. అందువల్ల వారు ఎక్ఛేంజిలోని ఆపరేటర్లతో నెల మామూళ్లు కుదుర్చుకొని బిల్లులు లేకుండా ట్రంకాల్సు, ఎస్.టి.డి.లు చేసుకుంటుంటారు. ఒక్కొక్క వ్యాపారి కనీసం నెలకు రెండు నుంచి ఐదు వేల వరకు ఈ రూపంలో బిల్లులు ఎగ్గొడుతున్నట్లు వినికిడి. ఎక్ఛేంజి మొత్తం మీద దాదాపు ఐదు లక్షలు ప్రభుత్వ ఖజానాకు చిల్లిపడుతున్నది. మీటరు తిరుగుతుందని తెలిస్తే ఎవరైనా త్వరగా మాటలు ముగించడానికి ప్రయత్నిస్తారు; మీటరు తిరగదని తెలిసినపుడు సంభాషణ పొగడియడానికి చూస్తారు.

ఈ విషయాన్ని పసిగట్టి విజయవాడకు చెందిన నిపుణులు ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా ఒక రోజు మూడు గంటల పాటు కావలి నుంచి వెళ్లే ట్రంకాల్స్‌పై నిఘా పెట్టారట. ఆ మూడు గంటలలోనే దాదాపు 200 ట్రంకాల్స్ ఎక్ఛేంజ్ నుంచి వెళ్లాయట. ఆ నంబర్లన్నింటినీ ఎలక్ట్రానిక్ పరికరాలు నమోదు చేశాయి. తర్వాత వాటిని, ఎక్ఛేంజిలోని ట్రంకాల్స్ టిక్కెట్లతో సరిచూస్తే, ఇంచు మించు 90 శాతం రికార్డు కానట్లు, అసలు టికెట్లే వ్రాయనట్లు తేలిందట. ఆ ఒక్క రోజులోనే దాదాపు 25, 30వేలు విలువ చేసే ట్రంకాల్స్‌కు బిల్లులు ఎగ్గొట్టినట్లు బయటపడింది. ఈ విష

జిల్లా వార్తలు

యాన్ని విజయవాడ అధికారులు కావలికి చెప్పకుండా నేరుగా నెల్లూరుకు వ్రాశారట. అయితే అక్కడి అధికారులు ఏమీ చర్య తీసుకోకుండా మొత్తం ఫైలును కావలికే పంపినట్లున్నారు. కావలి అధికారులు దానిని శాశ్వతంగా భూస్థాపితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. క్లాత్ మర్చెంట్స్ అంగళ్ల నుంచి నిరంతరాయంగా దొంగ ట్రంకాల్స్ మాత్రం దర్జాగాపోతున్నాయి.

ఆపరేటర్లపై చర్య తీసుకుంటే వారు తమపై వ్యక్తిగతంగా కక్ష సాధింపుకు పాల్పడుతారని, వ్యాపారుల అండ వుండడం వల్ల ఏమైనా జరుగవచ్చునని అధికారులు భయపడుతున్నట్లుంది. ఆపరేటర్ల యూనియన్ భయమూ వుంది. టెలిఫోన్ చట్టం ప్రకారం దొంగ ట్రంకాల్స్‌కు డిస్మిసల్ వంటి పెద్ద శిక్షలు వేయవచ్చు; బయటపడిన క్షణంలోనే సస్పెండ్ చేయ వచ్చు. విజయవాడ కంప్యూటర్లు కనిపెట్టిన ప్రకారం కావలి కుంభకోణంలో భాగస్తులను కనిపెట్టి, ఆ సమయంలో ఆయా బోర్డుల దగ్గర పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సంతటిపై చర్య తీసుకునే వీలున్న నెల్లూరు అధికారులు యూనియన్ భయానికి జంకినట్లున్నారు; జిల్లా అధికారులే తప్పించుకో జూసినపుడు తమకెందుకని కావలి అధికార్లు కళ్లుమూసుకుంటున్నారు.

బుచ్చి వివేకానంద స్కూలు వార్షికోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం వివేకానంద రెసిడెన్షియల్ స్కూలు ద్వితీయ వార్షికోత్సవం 2 తేది జరిగింది. డాక్టర్ ఎన్. అయ్యల రెడ్డి అధ్యక్షించారు. శ్రీ మోనా సభ నధ్యక్షించారు. కనుపర్తిపాడు హై స్కూలు హెడ్మాస్టర్ శ్రీ ఎం. రామిరెడ్డి, శ్రీ డి. సుబ్బారెడ్డి, శ్రీ ఎ. రామసుబ్బారెడ్డి మాట్లాడారు. ఆంధ్ర బ్యాంకు మేనేజర్ శ్రీ ఎ. భాస్కర రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. స్కూలు హెడ్మాస్టర్ శ్రీ చీమల మిత్ర రామకృష్ణయ్య

కొరవ 7 పేజీలో

నెల్లూరు నలుచెరగుల్లో

విమర్శకుడు

మెడికల్ కాలేజి– ఒక వదంతి

ప్రయివేటు మెడికల్ కాలేజిల స్థాపనకు అనుకూలంగా చట్టం గావించ బడింది కాబట్టి, యాభై శాతం సీట్లకు క్యాపిటేషన్ ఫీజు తీసుకునే అవకాశం కల్పించబడింది కాబట్టి, నెల్లూరులో ఈ విద్యా సంవత్సరంలోనే మెడికల్ కాలేజి ప్రారంభం కావచ్చునని ఒక వదంతి. జనార్దన రెడ్డి ముఖ్యమంత్రిత్వం అటువంటి ప్రతిపాదనకు దోహదకారిగా వుంటుంది గదా!

ఒక బంగారు కొండ ఈ బృహత్తర కార్యానికి పూనుకోవచ్చునని కూడా వూహ ; శుభం!

చేపల కాలేజి ఈ ఏడే!

చేపల కాలేజి ఈ సంవత్సరమే ప్రారంభమవుతుందని విశ్వసనీయ వార్త. మెడిసన్, ఇంజనీరింగు తదితర సాంకేతిక కోర్సులకు జరిగే ఎంసెట్ పరీక్షల తోటి ఈ కాలేజిలో చేరగోరే విద్యార్థులకు కూడా జరుగుతాయని, మెరిట్‌ను బట్టి సెలక్టు చేసుకోబడతారని, ఈ సంవత్సరం 20మంది విద్యార్థులు చేర్చుకో బడతారని, కాలేజి ఈ సంవత్సరం బహుశా నెల్లూరు వరి పరిశోధనా కేంద్ర భవనాలలోనే జరగవచ్చునని తెలుస్తున్నది. ఫిషరీస్ కాలేజికి అధ్యాపక నిర్వహణ సిబ్బంది నియామకం మాత్రం ఇంకా జరుగలేదు. ఈ కోర్సు నాలుగు సంవత్సరాలు; ఇవ్వబడే డిగ్రీ B.F (Sc).

ఈ కాలేజి భవన నిర్మాణం కొరకు, ముత్తుకూరు గ్రామం ముందే, కోర్టుకు అనుకొని, దక్షిణంగా 15 ఎకరాల స్థలం కేటాయింపు జరిగి, గత ఆగస్టు 31 తేది ముఖ్యమంత్రి శ్రీ జనార్దన రెడ్డి శంకుస్థాపన చేశారు కూడా. బ్రాకిష్ వాటర్ (ఉప్పునీళ్ళు) – చేపలు, రొయ్యల పెంపకానికి ఫిషరీస్ కాలేజికి అనుబంధంగా, బీసెన్‌కు దక్షిణంగా అర కిలో మీటరు దూరంలో కాదోలు 100 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించబడి, కాలేజికి స్వాధీనం చేయబడింది.

ఫిషరీస్ కాలేజి పథకానికి ఐదేళ్లకు 4 కోట్ల 80లక్షల రూపాయలు కేటాయించ బడింది. అందులో ఈ ప్రాథమిక ఏర్పాట్లకు ఈ సంవత్సరం 13 లక్షల 50 వేలు విడుదల చేయబడింది. దీనితో, ఫర్నిచరూ, ఒక బస్సు, ఒక జీపు కొన బడ్డాయి. వంద ఎకరాల క్షేత్రానికి ముత్తుకూరు రోడ్డు నుండి నేరుగా రోడ్డు వేయుటకు 2 లక్షల 30 వేలు; క్షేత్రం వద్ద పెద్ద నిర్మాణానికి 2 లక్షల 30 వేలు కేటాయించబడ్డాయి.

ప్లీనరీకి భారీ తరలింపు

తిరుపతి ప్లీనరీకి నెల్లూరు నుంచి భారీ ఎత్తున కార్యకర్తలను తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందిరా భవన్‌లో టికెట్ల నమోదుకు కౌంటర్ తెరిచారు. ఈ రోజు (10తేది) ఉదయానికి 200మంది టికెట్లుగా పేర్లు రిజిష్టరు చేశారు. సాయంత్రానికి మరొక 300 మంది చేరవచ్చునని అంచనా

నెల్లూరు సర్వేపల్లిల నుంచి పోటీలు పడి బస్సులలో, లారీలలో బహిరంగ సభకు జనాలను తోలే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంత్రి శ్రీ మాదాల జానకిరాం, ఎమ్మెల్యే శ్రీ సి.వి. శేషారెడ్డి ఈ తరలింపుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. 14తేది ర్యాలీలో పాల్గొనే నెల్లూరు శకటం కూడా మంత్రి పర్యవేక్షణలో తయారౌతున్నది.

చేపల రుణాలు వరప్రసాదం!

నిరంతరం రుణాన్వేషణలో వుండే భోక్తలకు, చేపలగుంటల రుణాలు దేవుడు పంపిన వరప్రసాదాలుగా వున్నాయి. పలుకుబడులు, మొగమాటాలు, సిఫారసులు, ఒత్తిడులు, నిష్ఠూరాలతో సెంట్రల్ బ్యాంకి అధ్యక్షుడు శ్రీ వేమారెడ్డి రామచంద్రారెడ్డి పది కేజిలైనా బరువు తగ్గి ఆరోగ్యం పొందేటట్లున్నారు.

పంపకం కావలసిన దానిలో నాల్గు వంతులు కలెక్టరు గారి భాగానికిపోయినట్లుంది; అరు వంతుల వాటా అధ్యక్షుని నెత్తినబడినట్లుంది. అప్పంటే పప్పుకూడైపోయింది మన జనానికి! తీసుకున్నదాని మీద ఖర్చు పెట్టినా పెట్టకపోయినా, తిన్నా, దుర్వినియోగం చేసినా అడిగే వాడుండడు. అడిగినా తప్పించడానికి ఎవడో ఒక ప్రజాసేవకుంటాడు. అందువల్ల దిగుల్లేదు. ఎన్ని విధాలుగా ఎన్ని చోట్ల ఎంత అప్పు దొరికినా పట్టడానికి అలవాటు పడిన పర్మినెంట్ ఖాతాదార్లు కోకొల్లలుగా వున్నారు. చేపలలోనుకు ఒక మాజీ శాసనసభ్యుడు ఒకటికి పది దరఖాస్తులతో తయారట; అన్నీ బినామీ; అన్నీ అనామత్తే; తాను పడిందానికి కాదు, తోటి కోడలు నవ్వేందానికి ఏడ్చేవాళ్లు కొందరట. మీరు ఆమోదించండి తర్వాత సంగతి మేము చక్కచేసుకుంటాం అని వుపాయం చెప్పేవాళ్ళు కొందరట; మరి కొందరు ఎదురుగా, దూరంగా కూర్చుని తమ ప్రతికూలురకు ఇవ్వవద్దని కనుసైగతో చెప్పేవారట....ఈ విధంగా వుందట చేపల అప్పుల భాగోతం. బ్యాంకులు, ప్రభుత్వ ధనాన్ని పటిక బెల్లంగా భోంచేయడాన్ని తమ స్వార్థం కోసం రాజకీయ నాయకులే మరిగారు. అప్పుడు మానమంటే ఎట్లాపోతుంది? అందులో సెంట్రల్ బ్యాంకు సూపర్ వైజర్ల హస్తలాఘవం. అవినీతి అవధులు దాటివుందని ప్రతీతి. దివాలా తీసి వున్న బ్యాంకుకు సంబంధించి బకాయిల వసూళ్ళ మీద శ్రద్ధవహించ వలసింది పోయి, దొరికినంత వరకు తిందామను కోవడం దారుణం. పూర్వం వలె శ్రీ హరి కోట వంటి పనిష్మెంటు కేంద్రం ఏదైనా వుంటే, ఇటువంటి వారందరూ అక్కడకు తరుమదగి వుంటారు!

రెడ్‌క్రాస్

నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సర్వ

కొరవ 6 ఎ పేజిలో

ఎఐసిసి

(5 పేజీ తరువాయి)

జనార్దన రెడ్డి అవిరళ సామర్థ్యంగా వినియోగించుకున్నారు. సభ ఏర్పాట్లు వర్ణించడానికి మాటలు చాలవు. అవి చూస్తే గాని, అనుభవానికి రాని కథలు. 180 ఎకరాల స్థలం ప్రతిరోజూ వారం రోజులలో చదును చేశారు. 20 బుల్ డోజర్లు రాత్రీ పగలు పనిచేశాయి. ఆర్కిటెక్ట్ గోవింద రావు నాలుగంటే నాలుగు దినాలలో వివిధ విభాగాల డిజైన్ తయారు చేసి ఇచ్చారు. స్థలాన్ని ప్రధానంగా ఆరు భాగాలు చేశారు. మహాసభ పందిరి, ఎగ్జిబిషన్ స్టాల్స్, భోజన మందిరాలు, బహిరంగ సభావేదిక, ప్రెస్ డివిజన్, కార్యకర్తల వసతిగా స్థలాన్ని విడగొట్టారు.

బాధ్యత అంతా సుబ్బరామ రెడ్డి గారు తన భుజాల కెత్తుకున్నారు. ముఖ్యమంత్రి తరఫున శ్రీ పద్మనాభ రెడ్డి సమన్వయించారు. మాగుంట వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు చెందిన దాదాపు 500 మంది ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, పనివారు వచ్చి వాలిపోయారు. అపర కుబేరుడే ఇక్కడ మకాం పెట్టినప్పుడు ఇక డబ్బుకోసం చింత ఏముంది? పనులు రోదసీ నౌక వేగంతో పరుగులు పెట్టాయి.

మొత్తం 12 లక్షల చదరపుటడుగుల తాత్కాలిక కట్టడాలు ప్లాన్ చేశారు. అందులో ప్లీనరీ సమావేశ వేదిక ఒక్కటే లక్షా 80 వేల చదరపుటడుగులు. 600 అడుగుల పొడవు 300 అడుగుల వెడల్పుతో 45 వేల కుర్చీలు అమర్చేటట్లు ఈ పందిరిని కోలాయమానంగా నిర్మించారు. పడమటి వైపు వేదిక. దాని పొడవు 80 అడుగులు. ఎత్తు 20 అడుగులు. వెనుక పెద్ద గ్లోబ్ లోని భారతదేశపటం పై ప్రధాని పి.వి నిలబడినట్లు, రాజీవ్, ఇందిర, నెహ్రూలు ఆయన్ను ఆశీర్వదిస్తున్నట్లు రంగుల చిత్రం చిత్రించారు. వేదికకు అటు ఇటు ప్రధాని, పి.ఎం. క్యాంప్ కార్యాలయాలు. పక్కాభవనాన్ని తలపింప జేసే కట్టడం కట్టి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో అలంకరించి, ఎయిర్ కండిషన్ చేశారు. వేదికను కూడా సెంట్రల్ ఏసి చేశారు. 110 టన్నుల సామర్థ్యం కలిగిన 85 ఏసి పెట్టెలు – అన్నీ సుబ్బరామ రెడ్డి ఆఫీసుల నుంచి తెప్పించినవే – అమర్చారు.

ఈ మండపం తూర్పు భాగంలో బ్రహ్మాండమైన స్వాగత తోరణం. దాదాపు అర కిలోమీటరు పొడవున అట్టల గోడ నిర్మించారు. అందులో అమరావతి, లేపాక్షి శిల్పకళలు, తెలుగు సంస్కృతి చిహ్నాలు, దేవాలయ వాస్తు కళ తదితరాలు ప్రతిఫలింప జేశారు. ప్లీనరీకి ఇదే పెద్ద ఆకర్షణ. దానికి అటు ఇటు రెండేసి కిలోమీటర్ల దూరం అరవై అడుగుల ఎత్తైన పెద్ద పైపుల కట్టడమొకటి కట్టారు. దాని పై నూరేళ్ల కాంగ్రెస్ చరిత్రలోని వివిధ ప్రధాన ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. ఈ కోట మధ్యనే సాధారణ సందర్శకులను ఆహ్వానం పలుకుతూ చంద్రగిరి కోట నమూనాతో స్వాగత ద్వారం నిర్మించారు. ఆ ద్వారం నుంచి చూస్తే దూరంగా రాజీవ్ విగ్రహం కన్పిస్తుంది. ఈ రెండింటి మధ్యలో ఎగ్జిబిషన్ స్టాల్స్ 200 అంగళ్లు తెరుస్తున్నారు. దక్షిణం వైపు భోజన శాలలు; వంటగదులు. లక్షమంది ఒకే సారి భోజనం చేసే ఏర్పాట్లున్నాయి.

15 వేల మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చూస్తారు. 11 ఛానల్స్‌తో అత్యాధునిక వైర్‌లెస్ వ్యవస్థ నెలకొల్పారు. తిరుపతికి 40,50కిలోమీటర్ల పరిధిలో చీమచిటుక్కుమన్నా క్షణంలో తెలిసి పోతుంది. ప్రాంగణమంతా క్లోజ్డ్ సర్క్యూట్ టివిలు పనిచేస్తాయి. చీకటికి చోటు లేకుండా మూడువేల ఫ్లడ్ లైట్లు, 5 వేల ట్యూబ్ లైట్లు బిగించారు. రాత్రయ్యే సరికి రాజీవ్ నగర్ దేవేంద్ర లోకం వలె కన్పడుతున్నది. ఆవరణంలోనే ఒక పెద్ద సబ్‌స్టేషన్, ఆర్‌టిసి బస్టాండు నిర్మాణమైనాయి. కరెంట్ పోతే ఇబ్బంది లేకుండా 30 జనరేటర్లు పెట్టారు. 12 ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సమావేశ ప్రాంగణం మంతా మంచి నీటికి కొరత ఎదురు కాకుండా వేలాది కొళాయిలు బిగించారు. ఆరు ప్రదేశాలలో హెల్త్ సెంటర్లుంటాయి. ప్రాథమిక చికిత్స జరుగుతుందక్కడ. 80 పడకల తాత్కాలిక ఆస్పత్రి నెల కొల్పారు. హార్ట్‌ఎటాక్ వచ్చినా అక్కడే చికిత్సకు పరికరాలు, డాక్టర్లు రెడీ!

చెప్పుకుంటూ పోతే ఈ ఏర్పాట్లకు అంతమే వుండదు; కోట్ల రూపాయలు నీళ్ల లాగా ఖర్చయి పోతున్నది; సుబ్బరామ రెడ్డి, పద్మనాభ రెడ్డిల కష్టం పగవారికి కూడా వద్దు.

ఎండపోత అంటే ఎట్లా వుంటుందో దశాబ్దాల క్రితమే మర్చిపోయిన సుబ్బరామ రెడ్డి ఎండలో, తలపై గుడ్డకూడా లేకుండా రోజంతా నిలబడి పనిచేయిస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. పాపం.. అంతస్తులు మర్చిపోయి లారీల పై ఎక్కి డ్రైవర్లను బుజ్జగిస్తూ, కూలీలను ఉషారు పరుస్తూ, పరుగులు పెడుతూ, అందరి చేతా పరుగులు పెట్టిస్తూ మొత్తం కార్యభారాన్ని తానొక్కడే మోస్తున్నాడాయన. జేబుకు చిల్లిపడి ధారాపాతంగా సొమ్ము కారిపోతున్నా, రోజుకు ఇరవై గంటలు నిలబడి పనిచేయవలసి వస్తున్నా ఆయనలో ఉత్సాహం తగ్గలేదు. తిరుపతికి వచ్చే ముందు అమృతమేదైనా సేవించి వచ్చాడేమో మరి! 'బాస్' అంత కష్టపడుతుంటే తక్కిన వారికి తప్పుతుందా, మాదాసు గంగాధరం సైతం ఆపసోపాలు పడుతూ ఆ ఎండలో పరుగులు పెడుతున్నాడు. పద్మనాభ రెడ్డికి ఊపిరి పోతున్నది. మొత్తానికి జనార్దన రెడ్డికి వీరందరిమీద ఎప్పుడో చెప్పలేని కసి వున్నట్లుంది. ఈ రూపంలో తీర్చుకుంటున్నారు.

రాష్ట్రమంత్రులు కూలీల మీద మేస్త్రుల క్రిందే లెక్క. మట్టి ఎత్తే దగ్గర ఒకరు, దించే దగ్గర ఒకరు, చెక్కలు కోసే దగ్గర ఒకరు, అతికించే దగ్గర ఒకరు నిలబడి వున్నారు.

సభ జరిగే ఆవరణాల చుట్టూ ప్రాంతం పంటపండింది. గత నెల వరకు 10 వేలున్న ఎకరా ఇప్పుడు 2 లక్షలట.

నెల్లూరు ముచ్చట్లు

6 పేజీ తరువాయి

సర్వసభ్యసమావేశం 20వ తేది ఉదయం కలెక్టరాఫీసు ప్రాంగణంలోని సైక్లోన్ మీటింగ్ హాల్‌లో జరుగుతుంది. సభ్యులందరికీ ఆహ్వానమందజేస్తున్నారు. రెడ్‌క్రాస్ పర్సన్ ఇన్‌ఛార్జి, రిటైర్డ్ హుజూర్ శిరస్తదార్ శ్రీ టి. దొరస్వామి.

"పిటిషన్లు తెండి!"

మాజీమంత్రి, కోవూరు శాసన సభ్యుడు శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసుల రెడ్డి 11,12,13, తేదులలో కోటలో; 18, 19, 20, 21 తేదుల్లో నెల్లూరు దర్గామిట్ట స్వగృహంలో మకాం చేస్తారట; ప్రజలను పిటిషన్లేమైనా వుంటే తెమ్మంటున్నారు. శ్రీనివాసులు రెడ్డి గారు నెల్లూరులో వుండేటప్పుడు గ్రామాలలో కూడా పర్యటిస్తారట.

మరణాలు

నాయుడుపేట మండలాధ్యక్షుడు, ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి, తిరుపతిలో సైతం ప్రధాన పౌరుడుగా స్థానం సంపాయించుకున్న మిత్రుడు శ్రీ చదలవాడ కృష్ణమూర్తి, ధర్మపత్ని శ్రీమతి వెంకటసుబ్బమ్మ (39) ముంచుకొచ్చిన అస్వస్థతతో 6 తేది అకాల మరణానికి గురియైంది.

కృష్ణమూర్తి ఏకైక కుమారుడు శ్రీనివాస తేజను సముద్రుడు పొట్టన పెట్టుకున్నాడు; తన ప్రాణంలో సగం ప్రాణప్రదమైన సతీమణి మృత్యువాతబడింది. కృష్ణమూర్తికి ఒక కుమార్తె వుంది. పెళ్లి చేసి పంపారు; వెలుగులేని ఇచ్చారు; కాని సంసారం పచ్చగా కలకల మంటూ వుండేదాన్ని చూడలేకపోయాడు పాడు దేవుడు! పతివియోగ దుఃఖభారంలో వున్న కృష్ణమూర్తికి మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.

* * *

1940 ప్రాంతంలో మూడు నాలుగేళ్ల పాటు జమీన్‌రైతులో కంపోజిటర్ గా చేసి, తర్వాత ప్రెస్ ఓనరుగా గూడూరులో స్థిరపడిన అతి వాద భావాలుగల వ్యక్తి; నిష్కపటి, నిర్మొగమాటి శ్రీ గ్రిద్దలూరు పెంచలయ్య (74) 30 తేది కాలధర్మం చెందారు. వారి కుటుంబానికి మా సానుభూతి.

నెల్లూరు బజారు

మొలగొలుకు	
9672 పాతవి	3300/-
9672 కొత్తవి	2800/-
9674 పాతవి	3600/-
9674 కొత్తవి	3000/-
ఐ.ఆర్. 20	2600/-
నున్నాలు	
మొలగొలుకు బియ్యం 70 కి	520/-

పాతప్లీనరీలు

(2 వ పేజీ తరువాయి)

అప్రతిహతంగా వున్నప్పుడు. [illegible] బూర్గుల రామకృష్ణ రావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో 1953 లో కాంగ్రెస్ ప్లీనరీ జరిగింది. దానికి నానల్ నగర్ అని నామకరణం చేశారు.

ముందుగా 1968 జనవరి మొదటి పక్షంలో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ వి గూర్చి సంక్షిప్తంగా వివరిస్తాను. హైదరాబాదులో జరిగింది 71 వ కాంగ్రెస్ మహాసభ; రేపు తిరుపతిలో జరగబోయేది 79 వ ప్లీనరీ. ఆ కాంగ్రెస్‌కు ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ఎస్. నిజలింగప్ప; విరమిస్తున్న అధ్యక్షుడు కె.కె. కామరాజ్. కొత్త - పాత అధ్యక్షులతో, ప్రతినిధులతో మద్రాసు నుండి హైదరాబాదుకు పోతుండిన కాంగ్రెస్ ప్రత్యేక రైలు ఆ రోజు మధ్యాహ్నం భోజనానికి నెల్లూరు స్టేషన్‌లో ఆగింది. ఆనం వెంకట రెడ్డి, సంజీవ రెడ్డి గారల ఆధ్వర్యంలో ప్లాట్ ఫారం మీదే పందిళ్లు వేయబడి భోజనాలు ఏర్పాటు వేయబడ్డాయి. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్గీయ తిమ్మారెడ్డి గారు కూడా ఆ రైలులోనే అధ్యక్షులతో ప్రయాణించారు.

ప్రధాని శ్రీ మతి ఇందిరా గాంధీ తదితర అగ్రనాయకులందరూ పాల్గొన్నారు. చంద్రశేఖర్, మోహన్‌ధారియా, హర్షదేవ్ మాలవ్య వంటి కాంగ్రెస్ అతి వాదులు కూడా పార్టీలో వుండి వారు; హైదరాబాదు సభల్లో పాల్గొని చర్చలు తీర్మానాలపై పెదవి విరిచారు. ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డికి ఏర్పాట్లు చాల సులభ సాధ్యమైంది. వ్యతిరేక వర్గం వారు కూడా పూర్తిగా సహకరించారు; మమేకంగా పనిచేశారు. ఆనాడు డాక్టర్ చెన్నారెడ్డికి అంత ప్రధానమైన పాత్ర వున్నట్లు లేదు. మాకల రామచంద్రా రెడ్డి, వెంగళ రావు, పిడతల రంగారెడ్డి, కొత్త రఘురామయ్య గారలకు వివిధ బాధ్యతలు అప్పగించబడ్డాయి. అందులో వెంగళ రావు గారికి వాలంటీర్ దళ అధిపత్యం; రఘురామయ్య నిధుల సేకరణ; ప్రతి నిధుల ఏర్పాటు ఆనాటి హౌసింగ్ మంత్రి నలమోతు చెంచురామానాయుడు గారికి అప్పగించబడింది.

మహాసభ ఏర్పాట్లు ఎందుకు సులభ తరమైనాయంటే హైదరాబాదు నగరంలో తిరుపతి వలె కాక రెడిమేడ్ వసతులున్నాయి. తిరుపతిలో వలె చెట్టుపుట్టలతో మరు భూమిగా వుండిన ఒక చెరువును ఒక కాంగ్రెస్ మహా నగరంగా తీర్చిదిద్దవలసిన వ్యయ ప్రయాసలు అక్కర అవసరం లేకుండా పోయాయి. మహాసభకు గాని, బహిరంగ సభకు గాని కొత్త చోటును వెతక వలసిన అవసరం లేకుండా పోయింది; లాల్ బహదూర్ స్టేడియం, దాని ప్రాంగణము సిద్ధాన్నంగా లభించాయి. జనార్దన రెడ్డి వలె బ్రహ్మానంద రెడ్డికి కళాత్మక అభిరుచులు, అందులో ఆడంబరాల మోజులు లేకపోవడం వల్ల ప్లీనరీ సభా స్థలం రాజకీయ కేంద్రస్థానంగానే కాక, కళల కాణాచిగా చక్కదనాల సొగసులతో, సకల శోభితం చేసే శ్రమ తప్పిపోయింది. ఈ రచయిత హైదరాబాదు కాంగ్రెస్‌ను తిలకించాడు. కంటిని ఆకర్షించిన ఒక్క అలంకరణా కంట బడలేదు. సాదా సీదాగా వున్నట్లనిపించింది. పామి యానాల ఏర్పాటు తప్ప చలవ పందిళ్ల బాదర బందీలేదు. వేదిక ప్రత్యేకంగా విశేషంగా చెప్పుకోదగిందిగా లేదు. లక్ష మంది పట్టే స్టేడియంలో కాంగ్రెస్ మహాసభకు హాజరైన జనసందోహం ఏ పాటిగా వుండి వుంటుందో వూహించుకోవచ్చు.

హైదరాబాదు కాంగ్రెస్‌కు నిర్వాహకులకు అనుకూలించిన మరో ముఖ్యమైన సౌకర్యం అది రాష్ట్రప్రభుత్వ కేంద్రం కావడం; ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ ప్రతిరోజూ ప్రతి క్షణ ప్రత్యేక పర్యవేక్షణకు అవకాశ ముండడం. ఇంకొక అనుకూలత – అది నగరం కావడం రాజ ప్రాసాదాల వంటి ప్రభుత్వ అతిథి గృహాలు, ప్రయివేటు భవనాలు కావలసినన్ని వుండడం; అగ్ర నాయకులకు ప్రత్యేకంగా బస ఏర్పాట్లు చేయవలసిన అవసరం లేకపోవడం. హౌసింగు బోర్డు వారు నిర్మించి అప్పటికి ఎవరికీ కేటాయించ కుండా వుండిన విజయనగర్, సంజీవ రెడ్డి నగర్ వంటి అనేక కాలనీలు ప్రతినిధుల వసతికి తయారుగా వుండినాయి. అన్నిటి కంటె ప్రధానమైన అనుకూలత నాయకులకు ఈనాటి వలె తీవ్రమైన భద్రతా ఏర్పాట్ల అవసరం లేకపోవడం.

ఇన్ని అనుకూలాలు, తయారైన సౌకర్యాలు, అన్ని హంగులూ వున్నా, మహాసభలకు 15 లక్షలు ఖర్చవుతుందని తొలి అంచనా; అది చివరకు మున్నయికి మించి పోయిందన్నారు. అధికారంలో వున్న కాంగ్రెస్ నాయకులందరూ తలలు మోటించి ఇంతగా చేసినా అంతా ప్రభుత్వాధికార్ల దాకిరి. సర్కారు ఖజానా ఖర్చు. అధికార దుర్వినియోగం అనే మంచి పేరు తప్పనే లేదు!

హైదరాబాదు మహాసభ వంట కాలలో ఆవకాయ, ఆంధ్రుల పచ్చళ్లు ఉత్తరాది వారిని విపరీతంగా నోరూరించాయట. ఆనాటి రాజస్థాన్ ముఖ్యమంత్రి మోహన్‌లాల్ సుఖాడియా ఆవకాయను కొసరి కొసరి పెట్టించుకుని తిన్నారట. తక్కిన ప్రతినిధులూ పచ్చళ్లను, కూరలను అమిత ప్రీతితో తిన్నారట.

ఆనాటి హైదరాబాదు కాంగ్రెస్ మహాసభల పై 'జమీన్‌రైతు' 12-1-68 తేది సంచిక మొదటి పేజిలో పతాక శీర్షిక ఇది "ముఖ్యమంత్రికి దేశవ్యాప్త ప్రాబల్యం కల్గించిన హైదరాబాదు కాంగ్రెస్"! తిరుపతి సభల అనంతరం కూడా ఈ శీర్షికె వెల్లుబడి అవుతుంది. ఒకటే తేడా! ఆనాడు ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి, ఈనాడు ముఖ్యమంత్రి జనార్దన రెడ్డి. ఆనాటి మహాసభల రిపోర్టులో మరో వాక్యం కూడా వ్రాయబడింది. "ఇందిరా గాంధీ ప్రశంసలు పొందిన హైదరాబాదు మహాసభల తర్వాత కాంగ్రెస్ కార్యవర్గంలో బ్రహ్మానంద రెడ్డి స్థానం పదిలమైంది" అని. ఈనాడు జనార్దనరెడ్డికి మాత్రం ఆ మాట వర్తిస్తుందని ఎందుకు అనుకో కూడదు.

1968 హైదరాబాదు కాంగ్రెస్ మహాసభలలో జనార్దన రెడ్డి ఒక మామూలు ప్రేక్షకుడే; తిరుపతి సభలకు ముఖ్యమంత్రిగా సర్వస్వమూను!

* * *

హైదరాబాద్ కాంగ్రెస్ సాదా సీదా అయితే 1964 నవంబరులో జరిగిన గుంటూరు ఏఐసిసి అత్యంత ఆడంబరంగా, వేడుకగా జరిగింది. ఈ ఏర్పాట్లకు ఆనాటి మంత్రి కె.కె. అలపాటి వెంకట రామయ్య సారథ్యం. చాలా శ్రమపడి, సర్వశక్తులూ వినియోగించి చేశారన్నారు.

ఈ ఏఐసిసి ఆకర్షణ విశేషం ప్రధానిగా లాల్‌బహదూర్ శాస్త్రి పాల్గొనడం; అంతకంటె పెద్ద ఆకర్షణ తండ్రిని కోల్పోయిన తనయగా, ఆయన రాజకీయ వారసురాలుగా భావింప బడుతుండిన శ్రీ మతి ఇందిరా గాంధీ రావడం. ఇది జరిగినప్పుడూ ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి గారే. కొత్త రఘురామయ్య గారు కేంద్ర మంత్రి అనుకొంటాను. కల్లూరు చంద్రమౌళి వంటి ప్రముఖులు ఆ ఛాయలకే రాకుండా జరిగారు.

విజయనగరంలో జరిగిన "విప్రహానగర్" తర్వాత బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అయ్యింది. అదీ పారుబడిన ఎర్రచెరువు అనే ప్రదేశమే. సభకు రెండు లక్షల మంది ప్రజలు వచ్చారట. విజయవాడ నుంచి గుంటూరు వరకు రోడ్డుకు ఇరుపైపులున్న చెట్లను మువ్వన్నెలతో సుందరంగా అలంకరించారట. టపాసా అందంగా ముస్తాబు గావించబడింది. జాతీయ నాయకులే కాదు, రాష్ట్ర నాయకులందరూ పాల్గొన్న, ఆంధ్ర కాంగ్రెస్ చరిత్రలో గుర్తిండిపోయే ఒక బ్రహ్మాండమైన సమావేశం ఇది.

— శ్రీ రామమూర్తి

జననము: 27.3.1927 — మరణము: 31.3.1992

శ్రీ తిక్కవరపు దయాకర రెడ్డి,

మేనేజింగ్ డైరెక్టర్,

నెల్లూరు స్ట్రా బోర్డు ప్రైవేట్ లిమిటెడ్ నెల్లూరు.

పాండిచ్చేరిలో పరమపదించినారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థించుచున్నాము. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాప సానుభూతులను తెలియజేయుచున్నాము.

మా అభివృద్ధికి, ఫ్యాక్టరీ అభివృద్ధికి, అహరహం కృషి చేస్తూ, పరిపాలనా దక్షతతో యజమానిగానే గాక, మాకు మార్గదర్శకుడుగా మా జీవితాలకు బాట నేర్పరచిన మహోన్నత హృదయుడు. మీరు లేని లోటు శాశ్వతమైనా, మీరు నిర్ధారించిన బాటలో క్రమ శిక్షణతో కృషి చేసి ఫ్యాక్టరీ అభివృద్ధిలో మా కర్తవ్యం నిర్వర్తిస్తామని, మీ ఆత్మకు శాంతి చేకూరేలా నడుచుకొంటామని, దీక్షతో అశ్రు నయనాలతో, శోకతప్త హృదయాలతో మీ ఆత్మకు శాంతి చేకూర్చాలని, మరో సారి సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాము.

విధేయులు

ఫ్యాక్టరీ మేనేజరు మరియు సిబ్బంది

పినాకినీ తీరం

(2 పేజీ తరువాత)

ప్రజల సానుభూతి శ్రీమతి సోనియా గాంధీ, ఆమె బిడ్డల మీద వుంది; అది వేరే సంగతి. కాని కాంగ్రెస్‌లో అభిమానిస్తున్న కాకలు తీరిన కాంగ్రెస్ నాయకుడే బ్రహ్మానంద రెడ్డి. సోనియా గాంధీని కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేయమనడం లోని ఔచిత్యం ఏమిటి?

ఇవన్నీ ఏమీ కాదు; బ్రహ్మానందరెడ్డి ఆగ్రహానికి కారణం కాంగ్రెస్ కుళ్లి పోవడమూ కాదు. ఆ ప్రజాస్వామ్యం కావడమూ కాదు. అధికారంలో వున్న వారు నియంతలు కావడమూ కాదు– ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు మీద అసంతృప్తి కలిగింది, విముఖత ఏర్పడింది. అసూయ జనించింది, అక్కసు పుట్టుకొచ్చింది... వీటన్నిటి సమష్టి ఫలితమే ఒక్కసారి విషం వెళ్లగక్కడం! ఇది కేవలం వ్యక్తిగత ఈర్ష్యా ద్వేషమే గాని, కాంగ్రెస్ పతనావస్థను గూర్చిన ఆవేదన కాదు. ఆందోళనా కాదు. బ్రహ్మానంద రెడ్డి గారి ఈ ప్రకటన వ్యక్తిగతమైనదో, సంస్థాగతమైనదో రెడ్డి గారి ఈ క్రింది మాటలే చెప్పక చెప్తాయి –

“నోరులేని తెలంగాణా ప్రాంతంలో జరిగిన ప్లీనరీ సమావేశానికి హాజరైన వారికి కాంగ్రెస్‌ను గురించి ఏమి తెలుసు?”

“నేను ఆయన్ను (పి.వి.ని) పైకి తీశాను. మంత్రిని చేశాను. ఏది వ్రాసివ్వమంటే అది వ్రాసిచ్చే వాడు. తెలివి గలవాడే”.

ఇవి వ్యక్తిగతంగా విషం క్రక్కే మాటలా మరేమైనానా మీరే వూహించండి. కుటుంబ పెత్తనం అన్నారు. నెహ్రూను, ఇందిరా గాంధీని, రాజీవ్ గాంధీని ఇదే మాట అన్నారు; బహుశా ఈ బ్రహ్మానందరెడ్డి గారు కూడా వీరిలో ఎవరినో ఒకరిని ఆ విధంగా నిందించి వుంటారేమో తెలియదు. పి.వి.ని. కుటుంబ పెత్తనం అని నిందిస్తున్న బ్రహ్మానంద రెడ్డి గారు అదే నోటితో శ్రీమతి సోనియా గాంధీని కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేయమని సలహాలిస్తున్నారు? ఇది రెండునాల్కుల విధానంగా, ద్వంద్వ నీతిగా లేదా? తన తొందర పాటు మాట వల్ల నీవు – నీ అన్న – నీ అన్న కుమారుడు అధికార పదవులు నెరపడం కుటుంబ పెత్తనం క్రిందకు రాదా అని పిల్లకాయల చేత అడిగించుకోవలసి వచ్చింది మాన్యులైన శ్రీ బ్రహ్మానంద రెడ్డి! అది పాత విషయం. ఇది కొత్త సంగతి అంటారేమో!

బ్రహ్మానంద రెడ్డి మాటలు వయసు మీరినందువల్ల సహజంగా కలిగే ధోరణా అనిపిస్తుంది. ధోరణి అంటే ‘అస్త్రాశస్త్రం’ అంటారే అది. లేకుంటే బ్రతికుండే కాంగ్రెస్ అధ్యక్షుణ్ణి తానొక్కడనే నంటాడా? నీలం సంజీవ రెడ్డి గారు నిక్షేపంగా లేరా? నిజలింగప్ప ఇంకా కీర్తి శేషులు కాలేదే! కాంగ్రెస్ అనుబంధంలో వీరు తనకంటే ఏమంత వెనుకబడిన వారు కాదే! ఈ ఒక్కమాట చాలదా బ్రహ్మానంద రెడ్డి గారి మానసిక స్థితిని తెలుసుకోవడానికి.

– కాంగ్రెస్ సంస్థ దుస్థితిని గూర్చి, కాంగ్రెస్ వాదుల వైఖరిని గూర్చి బ్రహ్మానంద రెడ్డి గారిలోని ఆవేదనను అర్థం చేసుకోవచ్చు; ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలతో వేల మంది కాదు లక్షల మంది ఏకీభవిస్తారు పాలు పంచుకుంటారు. ఈ రోజు కాంగ్రెస్ అంటే అవకాశవాదుల కూటమి. సంస్థ పతనాన్ని గూర్చి నిరంతరం మనోవ్యధకు గురియయ్యే బ్రహ్మానంద రెడ్డి గారి వంటి వారు కొందరున్నారు. కాని రెడ్డి గారు కూడా మొన్న గవర్నరుగా పదవీ విరమణ చేసే వరకు ‘కొత్త కాంగ్రెస్’ లో భాగస్వామే గదా!

బ్రహ్మానంద రెడ్డి గారు ముఖ్యమంత్రి జనార్దన రెడ్డికి ముఖ్యుడు; ఆప్తుడు; ఒక విధంగా చెప్పాలంటే చాలా కాలంగా గురుతుల్యుడు. ప్రస్తుతం జనార్దన రెడ్డి పి.వి.కి. పరమ ఆప్తుడు. అతి సన్నిహితుడు. తిరుపతి కాంగ్రెస్ మహా సభలను ఆంధ్రలో వభూతో నభవిష్యతి అన్నట్లుగా భారం నెత్తినేసుకొని నిర్వహిస్తున్న నాయకుడు. బ్రహ్మానంద రెడ్డి గారు తిరుపతి మహా సభల సందర్భంలో పి.వి. మీద దండయాత్ర జరపడమంటే, జనార్దనరెడ్డి పట్ల ఆయన వైఖరి ఏ విధంగా వుందనుకోవాలి? జనార్దన రెడ్డికి అండగా వున్న పి.వి.ని దూషించడమంటే రాష్ట్రంలో జనార్దన రెడ్డి వ్యతిరేక వర్గానికి వూపు నివ్వడం కాదా? పెద్ద రాజకీయాలివి!

బ్రహ్మానంద రెడ్డి గారు తిరుపతి కాంగ్రెస్ జరుగనున్న సందర్భంలో ఈ ప్రకటనలు చేయడం భావ్యంగా లేదు; వయసుకు తగినట్లు హుందా తనంగానూ లేదు. పెద్దవారికి చిన్నబుద్ధులు పుట్టడం దురదృష్టకరం.

నెల్లూరు

జిల్లా వార్తలు

(5 పేజీ తరువాత)

విద్యార్థి నాయకుడు శ్రీ టి. సుబ్రహ్మణ్యం నివేదికలు చదివారు. శ్రీ ఎ. దామోదరం వందనాలు చెప్పారు.

జమీన్‌రైతు

సంవత్సర చందా	రూ. 75.00
ఆరు నెలలకు	రూ. 40.00
విడి ప్రతి	రూ. 1.50



కృష్ణం కమల పత్రాక్షం పుణ్య శ్రవణ కీర్తనం : : వాసుదేవ జగత్సర్వం నౌమి నారాయణ హరిం

నెల్లూరు మూలపేటలో వేంచేసి యుండు

శ్రీ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవములు

ఫోన్: 26584

12.4.1992 నుండి 24.4.1992 వరకు జరుగును

తేది	ఉత్సవములు	బ్రహ్మోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు - రాత్రి - 7 గంటల నుండి
12.4.92	అంకురార్పణ	నటరాజ కళాసమితి (రిజిష్టర్డు) నెల్లూరు వారిచే ''కురుక్షేత్రం'' అను పౌరాణిక నాటకం ప్రదర్శించబడును.
13.4.92	ఉ. ధ్వజారోహణము రా. శేషవాహనము	జాదు సామ్రాట్, విశ్వవిఖ్యాత, మ్యాజిక్ విశారద శ్రీ బివి పట్టాభిరామ్ అండ్ పార్టీ, హైదరాబాద్ వారిచే గొప్ప "మ్యాజిక్ షో" ప్రదర్శించబడును.
14.4.92	ఉ. సూర్యప్రభ రా. హంసవాహనము	శ్రీ శ్రీనివాసా నాట్యమండలి, నెల్లూరు వారిచే, "శ్రీ సీతారామ కళ్యాణం" అను పౌరాణిక నాటకం ప్రదర్శించబడును.
15.4.92	ఉ. యాళి ఉత్సవము (సింహవాహనము) రా. చంద్రప్రభ	ప్రఖ్యాత సినీగాయని, భక్తి గీతారాణి, శ్రీ మతి వాణీ జయరాం, మద్రాసు వారి బృందంచే భక్తి పూర్వక శాస్త్రీయ గాత్ర కచ్చేరి
16.4.92	ఉ. చప్పరం **వెండి హనుమంత సేవ**	మద్రాసు మ్యూజికల్ అకాడమీ అవార్డ్ గ్రహీత, విఖ్యాత భరతనాట్య విదూషీమణి, కుమారి సుజాతా శ్రీనివాసన్ అండ్ పార్టీ, మద్రాసు వారిచే భరత నాట్యం కుమారి గాయత్రి చే నృత్య ప్రదర్శన జరుపబడును.
17.4.92	ఉ. మోహిని (గిన్నె భిక్ష) గరుడ సేవ	అంతర్జాతీయ నృత్య శిఖామణి పద్మశ్రీ శ్రీ మతి చిత్రా విశ్వేశ్వరన్ అండ్ పార్టీ మద్రాసు వారిచే గొప్ప పౌరాణిక విశ్వం – విష్ణుమయం – నృత్య నాటిక
18.4.92	రా. కళ్యాణము (సాయంత్రం 6 గంటలకు)	నాదస్వర బ్రహ్మ, ప్రఖ్యాత సన్నాయి విద్వాంసులు లయ రాజ సన్మానితులు శ్రీ యం కె యస్ శివ అండ్ నటరాజన్ సోదరులు, మద్రాసు పార్టీ వారిచే బ్రహ్మాండమైన నాదస్వర కచ్చేరి.
19.4.92	ఉ. రథము	1. శ్రీ కృష్ణ రాయబారము (పడకసీను) 2. నాదస్వర కచ్చేరి – మల్లాం వాస్తవ్యులు – కె. మస్తానయ్య కె. ప్రభావతి గార్లచే జరుపబడును.
20.4.92	ఉ. వెన్నతారీ ఉత్సవము రా.గుర్రం వాహనము	1. శ్రీ కృష్ణోపదేశము (సీను) దాశరథి గారిచే ప్రదర్శించబడును. 2. శ్రీ బాల సరస్వతి నాట్యమండలి సంపత్ నగర్, రాజమండ్రి వారిచే "శ్రీ రామాంజనేయ యుద్ధం" అను గొప్ప పౌరాణిక నాటక ప్రదర్శన జరుపబడును. కలియుగ ఆంజనేయ – శ్రీ పి. లక్ష్మణ రావు (రికార్డిస్టు) కళా ప్రవీణ –రేబాల రమణ, యం. ఆర్. విజయ కుమార్ మరియు ధరణి కోట ఆంజనేయ శర్మ మొదలగు నటీనటుల కాంబినేషన్‌తో
21.4.92	ఉ. తీర్థవాది (ముసుగు సేవ) రా. పొన్న వాహనము	శ్రీ సత్యసాయి నాట్యమండలి వారిచే శ్రీనివాస కళ్యాణం అను పౌరాణిక నాటకం ప్రదర్శించబడును.
22.4.92	రా. అవరోహణము	1. సువర్ణ హస్త కంకణ బిరుదాంకితులు హరికథా భారతి శ్రీమతి సి హెచ్ భవాని భాయి భాగవతారిణి గారిచే, హరికథా కాలక్షేపము. 2. శ్రీ రాజరాజేశ్వరి నాట్యమండలి వారిచే మోహిని భస్మాసుర అను నాటకం ప్రదర్శించబడును.
23.4.92	రా. వడయాత్తు ఉత్సవం	శ్రీ నేతాజీ నాట్యమండలి వారిచే – సత్య హరిశ్చంద్ర – అను నాటకం ప్రదర్శించబడును.
24.4.92		రసమంజలి ఆర్ట్స్, మూలాపేట, నెల్లూరు వారిచే, నాటికలు ప్రదర్శించబడును.

కావున భక్తులెల్లరు విచ్చేసి శ్రీ స్వామి వారు, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదములు స్వీకరించి, పై కార్యక్రమములను జయప్రదము చేయవలసినదిగా కోరుచున్నాము.

భవదీయులు

శ్రీ వేణుగోపాలస్వామి వారి వంశ పారంపర్య ధర్మకర్తలు

మజ్జిగ చంద్రమౌళి రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ

ట్రస్టీలు

ఆనం వివేకానంద రెడ్డి, ఆనం చంద్రశేఖర రెడ్డి, మన్నెం లక్ష్మినాథ్ రెడ్డి, తుమ్మల సుబ్బారెడ్డి.

సుబ్బారాయుడి మాదిరే వుంది- సుబ్బారాయుడి పెళ్ళి



దాసరి నారాయణ రావు ఇటు దర్శకుడు అటు నటుడు కూడా. ఆయనను అంతా పలు ముఖాలున్నాయనుకోండి. కాని ఇక్కడ ప్రముఖంగా ఆయనలోని దర్శకుణ్ణి, నటుణ్ణి గూర్చే చర్చించ వలసిన అవసరమొచ్చింది.

దాసరి దర్శకత్వం వహించిన చిత్రాలు ఎక్కువ. ఆయన నటించిన చిత్రాలు తక్కువ. ఎక్కువ తక్కువల విషయం ఎందుకు ప్రస్తావించ వలసి వచ్చిందంటే దాసరిలోని దర్శకుడు, నటుడు ఆయనలో ఎంతెంత తూకంలో వున్నారని తెలుసుకునేందుకే! దాసరి ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించినా కొన్ని చిత్రాలే ఆయనకు దర్శకుడిగా గుర్తింపు తెచ్చాయి. కాని ఆయన నటించిన పాత్రలు కొన్నే అయినా అవన్నీ ఆయన్ను గొప్ప నటుడిగా పరిగణనలోకి తెచ్చాయి. ఇలా బేరీజు వేసి చూస్తే దాసరికి దర్శకత్వం మీద కంటే నటన మీద అధికారం ఎక్కువున్నట్లు తెలుస్తుంది.

దాసరి నటించే పాత్రలు ఒక ప్రత్యేకత సంతరించుకొని వుంటాయి. ఆ పాత్రలను ఆయన తనదైన బాణీలో పోషిస్తూంటాడు. ఆ పాత్రలలో మరెవ్వరూ అంత వైవిధ్యంతో నటించ లేరుకనుకనే ఆ పాత్రల్లో దాసరి నటిస్తాడు. అందుకే ఆ పాత్రలకు దాసరి "టైపు" పాత్రలుగా పేరొచ్చింది. ఆయన నటించిన పాత్రలు కొద్దే అయినా అవి ఆయన్ను ఉత్తమ నటునిగా ప్రకటించేందుకు ఎంతో ఉపకరించాయి.

దురదృష్టకరమైన విషయమేమంటే దాసరి దర్శకత్వంలో తాజాగా తయారైన " సుబ్బారాయుడి పెళ్ళి" చిత్రం అచ్చం సుబ్బరాయుడిలా వుండటం. "సుబ్బరాయుడు" అన గానే అతనొక అవకతవకల అవతారమని, అమాయకత్వానికి ప్రతి రూపమని, అర్థం చేసుకుంటారు. ఇలాంటి సుబ్బరాయుడి పాత్ర ఆధారంగా ఈ చిత్రం అవతరించింది.

ఈ చిత్రానికి సంబంధించిన కథ దాసరి వ్రాశారు. ఈ కథను మరెవరైనా వ్రాసి దాసరి వద్దకు తీసుకొస్తే "ఇదీ ఒక కథేనా" అని దూరంగా పారేస్తాడు. ఎవరి బిడ్డవారికి ముద్దు.

సుబ్బారాయుడు (రాజేంద్ర ప్రసాద్) అమాయకుడైనా అతనికి పెళ్ళి మీద వ్యామోహం ఎక్కువ. నల్లకళ్ల జోడు, ఎర్రటోపి, మాసి మాయని దుస్తులు ధరించి చాలా పెళ్ళి చూపులకు పోయి అవి కలిసి రాక నిరాశ చెందుతాడు. ఒక చోట లలిత (ఐశ్వర్య) అనే చదువు కున్న, అందాల రాశిని చూస్తాడు. తన ఊహల్లో ఆ కల వారి అమ్మాయి మనసుకు అల్లుకపోతాడు. లలిత వ్రాసినట్లు సుబ్బారాయుడి మిత్రులు అతనికి ప్రేమ లేఖలు వ్రాస్తారు. వాటితో ఒకడుగు ముందుకు వేసిన సుబ్బారాయుడు లలిత

కొరవ 11 పేజీలో

ఉప్మా కంపెనీల ఊపిరి తీయడానికి ఉద్యుక్తులౌతున్నారు



ప్రారంభించిన సినిమాలను పూర్తి చేయలేని కంపెనీలను తమిళ నాడులో 'ఉప్మా కంపెని' లు అంటారందరూ. అలాంటి సంస్థలు మన రాష్ట్రంలోనూ లేక పోలేదు. ఇటువంటి సంస్థల ఆట కట్టించడానికి ఆలోచిస్తున్నది దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి. ఫిలిమ్ ఛేంబర్‌లో సంస్థ పేరు. చిత్రం పేరు రిజిస్టర్ చేస్తే చాలు - ఎవరైనా చిత్ర నిర్మాణానికి ఉపక్రమించవచ్చు. ఇలాంటి ఉప్మా కంపెనీలు ఇటీవల కుక్కగొడుగుల్లా అంతకంతకు ఎక్కువ వుతున్నాయి. ఈ చిత్ర నిర్మాతలకు చిత్ర నిర్మాణంలోని మెళకువలు తెలియవు. ప్రస్తుత పరిస్థితుల అవగాహన ఏ మాత్రం లేదు. వీళ్ల

కొరవ 11 పేజీలో

జిల్లా మునిసిఫ్ కోర్టు : పెనుకొండ

OS 11/88

[illegible]

24.4.92 [illegible] 10.30 [illegible]

K.S. [illegible]

కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా మున్సిఫ్ కోర్టులో

OS No. 263 of 1990

[illegible]
Vs — వాది
1) Mr. G. గోపాలకృష్ణయ్య
S/o. G. [illegible]
33 సంవత్సరములు
H.No. 44/181 [illegible] నగర్, కర్నూలు
2) Mr. R. [illegible]
3) Mr. C. [illegible] రెడ్డి,
S/o. C. [illegible] రెడ్డి, వయస్సు
39 సంవత్సరములు H.No.
40/58 [illegible] నగర్, కర్నూలు
4) Mr. G. [illegible] రెడ్డి
— ప్రతివాదులు

నోటీసు

[illegible] 29.4.1992 [illegible] 10.30 [illegible] 29.4.1992 [illegible]

P. సుబ్రహ్మణ్యం

శివారెడ్డి పద్యాలు

సోమశిల ప్రాజెక్టు

[illegible]

తిరుగులేదు

[illegible]

పాపిచరాయువు

[illegible]

స్వర్గీయ నన్నెసా!

[illegible]



4 తేది విజర్ స్టైల్ స్కూలు గ్రౌండ్సులో ప్రాంతీయుల క్రీడా సంబరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కె. రాజా, ఆనం రామనారాయణ రెడ్డి, తదితరులు [illegible]

షేర్లు

(4 పేజీ తరువాయి)

గెయిన్స్ బ్రాక్స్ తగ్గించడం మన్మోహన్ సింగ్ బడ్జెట్ వల్ల పన్నులు, దిగుమతి సుంకాలు తగ్గి పరిశ్రమలు కోట్లలో లాభాలార్జించ నున్నాయన్న ప్రచారం విపరీతంగా జరగడం కూడా ఈ వ్యామోహాన్ని ఇనుమడింపచేసిన అంశాలే!

అయితే మాయాజాలం వంటి షేర్ ప్రపంచంలో, వ్యాపార ఆర్థిక పరిజ్ఞానం లేని అమాయక మధ్య తరగతి ప్రజానీకం ఏమి కానున్నదన్నదే అందరినీ కలచివేస్తున్న సమస్య. స్టాక్ మార్కెట్ చరిత్రలు తెలిసిన వారెవరైనా ఈ భయం వ్యక్తం చేయక తప్పదు. ఈ మార్కెట్లు రాత్రికి రాత్రి కోటీశ్వరులను చేయగలవు; తెల్లవారేసరికి దివాలుగానూ మార్చగలవు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన సొమ్ము ఒక రోజులో మాయం కావడం ఇక్కడ సర్వసాధారణం. ఆవార్తలు విని తట్టుకోలేక ఎక్స్ఛేంజి ఆవరణంలోనే గుండెపోటుతో కుప్పకూలేవారు, ఆ రివ వాల పై నుంచే క్రిందకు దూకి ఆత్మహత్యలు చేసుకొనే వారు, గుట్టుగా ఇంటికి పోయి విషం త్రాగో, పిస్టల్ పేల్చుకొనో చచ్చేవారు అసంఖ్యాకం. బొంబాయిలో, న్యూయార్క్‌లో, టోక్యోలో, లండన్‌లో, ప్రపంచంలోని ప్రతి ప్రధాన నగరంలో ఇటువంటి సంఘటనలు కోకొల్లలు జరిగాయి, జరుగుతున్నాయి. ఎక్కడో వానలు కురిస్తే ఇక్కడ కొన్ని కంపెనీల షేర్లు పడిపోతాయి; ఇక్కడ ఎండ కాస్తే ఇంకెక్కడో షేర్ల ధరలు పెరుగుతాయి; ప్రభుత్వాలు మారినా, సమ్మెలు జరిగినా, ఏ నాయకుడో చనిపోయినా, ఏ పార్టీలో ఎన్నికల్లో ఓడినా, గెల్చినా, యుద్ధాలు జరిగినా, విధానాలు మారినా, ఆఖరకు స్టాక్ బ్రోకర్లు దివాలా తీసినా షేర్ల ధరలు విపరీతమైన ఒడిదుడుకులకు లోనౌతుంటాయి. ఎప్పుడు ఏ కంపెనీ షేరు ధర ఎందుకు [illegible] [illegible] పడిపోతుందో గ్రహించడం సాధారణ జనానికి అసాధ్యం.

ఏది ఏమైనా షేర్ల ధరలు [illegible] పెంపుదలతో పెరిగితే వచ్చే లాభం [illegible] లెక్కలు వేసుకోవడంతో పాటు, [illegible] పెట్టి కొన్న షేరు ధర పడిపోతే కంపెనీలు ఎట్లా మునిగి పోతాయో కూడా పరిగణనకు తీసుకొని షేర్ల వ్యాపారంలో చేయడం ఎవరికైనా తప్పని సరి. కాని, స్వల్ప కాలంలో కళ్లముందు కన్పిస్తున్న ఆదాయం పట్ల ఆకర్షితులైన ప్రజలు ఈ ఆలోచన చేస్తున్నారా అన్న సందేహం కల్గుతున్నది. వీధి వీధికీ ఇంటింటికీ పుట్ట గొడుగుల్లా పుట్టుకొని వస్తున్న సబ్ బ్రోకర్లు వాటాదారులకు సరైన సమాచారం అందించకుండా, షేరు ధర పెరిగితే వచ్చే ఆదాయం మాత్రం చూపి, వలలో వేసుకొని లక్షలలో పెట్టుబడులు పెట్టిస్తున్నారు. నిజమైన షేరు ధరకు, కృత్రిమంగా పెంచిన ధరకు తేడా తెలియని అమాయకులు ఆ జూదంలో సర్వం ఒడ్డుతున్నారు.

మన్మోహన్ సింగ్ పారిశ్రామికులకు అనుకూలమైన బడ్జెట్ ప్రకటించిన మాట నిజమే. కాని, కేవలం విధానాల మార్పుతోనే ఏ పరిశ్రమా రాత్రికి రాత్రి లాభాలు ఆర్జించలేదు. మారిన విధానాల ఆధారంగా తమ పద్ధతులు మార్చుకొని, పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తి చేసి, విక్రయించి, పన్నులు కట్టి, ఆ తర్వాత ఎప్పటికో డివిడెండ్ల రూపంలో లాభాలు పంచుతాయి. ఇవన్నీ జరగడానికి ఆరునెలల నుంచి రెండు సంవత్సరాల కాలం పట్టొచ్చు. అందులోనూ, మారిన విధానాలను లాభాలుగా మార్చుకోగల్గిన సమర్థత, [illegible], అవకాశం [illegible] పరిశ్రమలకు వుంటాయన్నది [illegible].

ఈ రోజు కృత్రిమంగా పెరిగిన షేర్ల ధరలు, ఆయా కంపెనీలు ఏదో ఒక కారణం వల్ల లాభాలు ఆర్జించలేక నష్టపోతే పాతాళానికి పడిపోతాయి. వాటిలో సమ్మెలు జరిగో, అగ్నిప్రమాదాలు సంభవించో, నిర్వాహకులలో పేచీలు తల ఎత్తో, సకాలానికి నిర్వహణ ధనం సమకూర్చుకోలేకో ఉత్పత్తి పడిపోయే అవకాశం వుంది. అప్పుడు నష్టపోయేది పరిశ్రమే కాదు; షేర్లు కొన్న వాటాదారుడు కూడా! ప్రభుత్వము, స్టాక్ ఎక్స్ఛేంజి నిర్వాహకులతో పాటు షేర్ బ్రోకర్లు సైతం వాటాదారులను [illegible] వంటి విషయాలలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి; కాని అది ఎక్కడా జరగడం లేదు.

ఇటీవలి కాలం వరకు భారత పారిశ్రామిక రంగం సాంప్రదాయ పద్ధతులను పాటించి షేర్ల విడుదలను పరిమిత స్థాయిలో జరపడం వల్ల దేశంలో అమ్మకానికి, కొనుగోలుకు లభ్యమయ్యే షేర్ల సంఖ్య చాలా తక్కువగా వుంది. ఆ రంగంలోకి ఒక్కసారిగా పాదం మోపిన లక్షలాది ప్రజలు కొనడానికి షేర్లు దొరకక, దొరికిన షేరును పలికిన రేటు ఇచ్చి కొంటున్నారు. బడ్జెట్‌లో ప్రకటించినట్లు పబ్లిక్ రంగ సంస్థలు 20 శాతం షేర్లు విడుదల చేసి; ప్రజల మానసిక స్థితిని గమనించి వందలాది కంపెనీలు అపరిమితంగా విడుదల చేయనున్న కొత్త ఇష్యూలు ఆచరణకు వస్తే తప్ప ఈ పరిస్థితి మారదు. అప్పటి వరకు పరిస్థితులు ఇదుపు తప్పకుండా వుంటే మధ్య తరగతి ఇన్వెస్టర్లు బ్రతికి బయట పడతారు; కొందరు ఆర్థిక శాస్త్ర నిపుణులు ఊహిస్తున్నట్లు ఈలోగానే "క్రాష్" సంభవిస్తే వేలాది కుటుం బాలు ఆరిపోతాయి. షేర్ల పట్ల పిచ్చిగా, వలం వెర్రిగా ఎగబడుతున్న ప్రజలు ఈ వాస్తవాన్ని గుర్తించాలి!

గ్రంథసమీక్ష

(5 పేజీ తరువాయి)

లో కూడా కొన్ని వేల సంవత్సరాల క్రితమే 'కథ' మన దేశం ఆవిర్భవించిందనే విషయం స్పష్టమవుతుంది.

హంస వింశతి, భోజరాజ కథలు, కాశీ మజిలీ కథలు, భట్టి విక్రమార్క కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు ఇలాంటివే. అయితే ఆధునిక కాలంలో సాంఘిక కాల, మాన పరిస్థితులను ప్రతిబింబిస్తూ కోకొల్లలుగా కథా సాహిత్యం వెల్లి విరుస్తోంది. ఇది శుభపరిణామం.

'ఆవేదనలు — అంత రంగాలు' కథా సంపుటిని యువ ఔత్సాహిక రచయిత శ్రీ పొట్లూరి సుబ్రహ్మణ్యం రచించారు.

ఇందులో మొత్తం [illegible] కథలున్నాయి. కథలన్నీ వాస్తవిక ప్రతి బింబిస్తున్నాయి. సామాజిక సమస్య [illegible] అద్దం పడుతున్నాయి. 'ఆమె వరం — అతని అంతరంగం' సంపుటి లోని మొదటి కథ. కథాంశం సాధారణమైనదే అయినా 'సుమిత్ర మేడమ్' పట్లరాఘవకున్న భ్రమల్ని తొలగించే [illegible] సన్నివేశాన్ని చక్కగా మలిచారు రచయిత.

రెండవ కథలో పెంకితనంతో పాఠకులలో ఆసక్తి కలిగిస్తుంది. జీవితం — జీవితం అనే కథ రాజారావు [illegible] [illegible] స్తోంది. సున్నితమైన [illegible] వ్యంగ్యంతో నిండి సామాజిక [illegible] ఒక సందేశం తో సాగుతుంది [illegible].

'ఐరావతమ్మ' కథలో బావి తగ్గడానికి గొంతల్రావు ఉపయోగించిన 'టెక్నిక్' బాగుంది. పాఠకులకింద వున్నవన్నీ ఇలాగే విన్నమణ వినిగింది. కాసులు ఆరుస్తున్నాయి, ముదుగు కాలువ, రచయితల కిరోక శాపం. ప్రేమ బలికోరుతుందా? కథలు పాఠకుల్ని చివరి దాకా చదివిస్తాయి. విభిన్న వర్గాలకు చెందిన ప్రజల్ని వారి సున్నితమైన సమస్యల నేపథ్యంతో, తనదైన శైలితో, చిత్రీకరించి సమకాలీన జీవితాన్ని మన ముందుంచారు శ్రీ పొట్లూరి సుబ్రహ్మణ్యం. మరో మాటలో చెప్పాలంటే జీవితం విలువైనదే కాదు, అర్థవంతమైనది కూడా అని చెబుతూనే క్రొత్తదనాల [illegible] పాఠకులు అనుభవించేలా చేశారు [illegible].

ఈ పుస్తకాన్ని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారికి అంకితం ఇచ్చారు. ప్రముఖ నటులు శ్రీ జగ్గయ్య ఈ సంపుటిని సమీక్షించారు.

[illegible] క్రైమ్ రచనలతో ఉక్కిరి బిక్కిరి [illegible] తెలుగు పాఠకులకు తప్పక చదువ వలసిన పుస్తక మిది.

(రచయిత: పొట్లూరి సుబ్రహ్మణ్యం, పేజీలు 120 వెల రూ. 25 లు ప్రతులకు : మహీధర పబ్లికేషన్స్, పూలతోట, వీధి, కోవూరు)

— పాయసం సుబ్రహ్మణ్యం

నెల్లూరు సంగతులు

(4 పేజీ తరువాయి)

సీతారామశాస్త్రి ఈ సంస్థకు, సభకు కూడా సూత్రధారి. చింతలపాటి పూర్ణానంద శాస్త్రి పంచాంగం చదివారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సభనధ్యక్షించారు. శ్రీ [illegible] శ్రీ [illegible] సన్మానం జరిగింది [illegible] కుటుంబీకుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నాయుడ్క్రష్ణ యాచేంద్ర సంగీతావధానం చేశారు.

మోటార్ ట్యాక్స్

లారీలు, బస్సులు, ట్రాక్టర్లు వాహనాలన్నీ 15 తేది లోపల పన్ను చెల్లించాలని ఆర్.టి.ఓ. శ్రీ పి. శ్రీనివాస్ కోరుతున్నారు.

చిత్రసమీక్ష

(9 పేజీ తరువాయి)

తండ్రి నరసింహం (రామిరెడ్డి) చేతిలో దెబ్బలు తింటాడు. నరసింహం పెంచుతున్న "దేవుడు" అనే పేరుగల ఎద్దు సుబ్బారాయుణ్ణి పొడుస్తుంది. అను పత్రి పాలవుతాడు. అది చిన్న లలిత, సుబ్బారాయుణ్ణి పూర్తిగా ప్రేమిస్తుంది. అతన్నే పెళ్ళి చేసుకునేందుకు నిర్ణయించుకుంటుంది. సుబ్బారాయుడి మిత్రబృందం పెళ్ళికి ఏర్పాట్లు చేస్తుంది. అది తెలిసిన నరసింహం, సుబ్బారాయుణ్ణి పొడుస్తాడు. అది తెలిసిన లలిత సుబ్బారాయుడి పై బడి ఏడ్చి నరాశ పడి ఆ కత్తితో తానూ పొడుచుకుంటుంది. ఇద్దరూ మళ్ళీ బ్రతుకుతారు. పెళ్ళి చేసుకుంటారు.

కథ అతుకుల బొంతగా అద్యంతం నీరసంగా నడుస్తుంది. కథా బలం లేనందువల్ల ఎక్కువ సన్నివేశాలను సృష్టించి చిత్రాన్ని రక్తి కట్టించాలని దర్శకుడు చేసిన ప్రయత్నం ఫలించలేదు. సత్యానంద్ మాటలు, వాసూరావు సంగీతం వినుగత్రిన ప్రేక్షకులకు కొంత ఉపశమనం కలిగిస్తాయి. మనసా హాయ గలవా పాట సంగీతంలోను సాహిత్యం లోనూ బాగుంది. రాజేంద్రప్రసాద్ హాస్యధోరణిలో తన ఉనికిని నిలబెట్టుకున్నారు. సుబ్బారాయుడి మిత్ర బృందంగా బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్ వగైరాలు హాస్యానికి ఉప యోగపడ్డారు. రామిరెడ్డి విలనీ మామూలు ధోరణిలో వుంది.

సినిమా

(9 పేజీ తరువాయి)

అవివేకం వల్ల తారల, సాంకేతిక నిపుణుల రేట్లు అమాంతం పెరిగిపోతున్నాయి! ప్లానింగ్ లేనందువల్ల నిర్మాణ వ్యయం అదుపు తప్పి, చిత్రాలు అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. ఇటువంటి నిర్మాతలను ఎలా ఏరి పారేయడమా అని దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి ఆలోచిస్తోంది. సంస్థ పేరును, చిత్రం పేరును రిజిస్టర్ చేసినప్పుడే వాణిజ్య మండలిలో అయిదు లక్షలు డిపాజిట్ చేయవలసి ఉంటుందనే నిబంధన ఒకటి పెట్టబోతున్నారు. లేకపోతే ఫిలిమ్ కోటా లభించదు. త్వరలోనే నిర్ణయం తీసుకోబడుతుంది. ఈ విషయం గురించి మన ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి కూడా ఆలోచిస్తుందేమో చూడాలి.

మరికొన్ని చిత్రాల పేర్లు

కౌముది పిక్చర్స్ "అమ్మోరు" వీరభద్ర పిక్చర్స్ "భంచిక భం" అంబి ప్రొడక్షన్స్ "పులివెందుల పులి" శ్రీ దుర్గా ఆర్ట్స్ "దొంగ పోలీస్" శ్రీ సాయిలక్ష్మి ప్రొడక్షన్స్ "చిల్లర మొగుడు–అల్లరి కొడుకు" శివశక్తి ఫిలిమ్స్ "చిన్నల్లాయి" సుప్రియ ప్రొడక్షన్స్ "భారతరత్న" పూర్ణధరా ప్రొడక్షన్స్ "లక్ష్మీ–శక్తి" శ్రీ వెంకట కృష్ణ ఫిలిమ్స్ "మన్మథుడే నా మొగుడు" అష్టలక్ష్మి కంబైన్స్ "నా మొగుడి పెళ్ళి" శ్రీ అండాళ్ ఆర్ట్స్ "అక్క మొగుడు" మనిషా ఫిలిమ్స్ "బాస్" వి.ఎస్.ఆర్ క్రియేషన్స్ "స్టేట్ హీరో" శ్రీ జయమల్లేశ్వర ఫిలిమ్స్ "రౌడీ అత్త–పోలీస్ అల్లుడు" సత్యశ్రీ మూవీస్ "ఓ ప్రేమా – నా ప్రేమా" శ్రీ కంచి కామాక్షి ఆర్ట్స్ "అల్లరి పిడుగు ముద్దుల భామ"

పడుగుపాడు గ్రామపంచాయితీ

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 36/92 తేది: 7.4.92

నెల్లూరు జిల్లా కోవూరు మండలం పడుగుపాడు గ్రామపంచాయితీలో ఈ క్రింది పనులు చేయుటకు గాను సీల్డు టెండర్లు కార్యనిర్వహణాధికారి గారిచే గాని వారి అనుమతిపొందిన వారిచే గాని 23.4.92 తేది గురువారం ఉదయం 11 గంటల వరకు తీసుకోనబడి 11.30 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షమున సదరు టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయగోరు వారు పంచాయితీ రిజిష్టర్డు కంట్రాక్టర్లు మాత్రమే అయి ఐటములకు ఎదురుగా నిర్ణయించిన ధరావత్తు 22.4.92 తేది బుధవారం సాయంకాలం 5 గంటల వరకు ఆఫీసు నందు చెల్లించి రశీదు పొందవలెను. ధరావత్తు చెల్లించిన రశీదును జతపరచని టెండర్లు పరిగణనకు తీసుకోనబడవు. మిగిలిన వివరములు ఆఫీసు పని దినమున పని వేళలందు వచ్చి తెలుసుకొనవచ్చును.

వ. నెం.	వివరములు	ఎస్టిమేటు రూ.	ధరవత్తు రూ.
1.	పెద్దపడుగుపాడు మెయిన్‌రోడ్డు నుండి బావి ప్రక్కన దాసరి వెంకటకృష్ణయ్య ఇంటి వరకు "గ్రావెల్ రోడ్డు" వేయుట	750/-	38/-
2.	పెద్దపడుగుపాడులో పాశం కృష్ణయ్య ఇంటి నుండి గోతాల కృష్ణయ్య ఇంటి వరకు "గ్రావెల్ రోడ్డు" వేయుట	800/-	40/-
3.	బైపాసురోడ్డు నుండి కావేటి బలరామయ్య ఇంటి వరకు వున్న వీధికి R.C.C తూములు వేసి "గ్రావెలు రోడ్డు" వేయుట	10000/-	500/-
4.	చిన్నపడుగుపాడు సత్యవతి నగర్‌లో వెలొట్టి చెన్నయ్య ఇంటి నుండి G.N.T. రోడ్డు వరకు "మెటల్ రోడ్డు" వేయుట	15,000	750/-
5.	పెద్దపడుగుపాడులో గండవరపు రంగారెడ్డి ఇంటినుండి చిన్నకోట వారి వీధి వరకు "సిమెంట్ రోడ్డు" వేయుట	18,000	900/-
6.	నేతాజీ నగర్‌లో గోపాలయ్య ఇంటి నుండి బాషా ఇంటి వరకు "గ్రావెలు రోడ్డు" వేయుట	4,000/-	200/-
7.	నేతాజీ నగర్‌లో గోపాలయ్య ఇంటి నుండి మిడతల శ్రీరంగయ్య ఇంటి వరకు "గ్రావెల్ రోడ్డు" వేయుట	6,000/-	300/-
8.	సరస్వతి నగర్ P.H. సుందర రామిరెడ్డి ఇంటి నుండి V. నారాయణ ఇంటి వరకు "మెటల్ రోడ్డు" వేయుట	7,000/-	350/-
9.	వాగుమిట్ట తిరుపతి నాయుడు రైసు మిల్లు పోవు మార్గమునకు "గ్రావెలు రోడ్డు" వేయుట	9,200/-	460/-
10.	ఇనుముడుగు జంక్షన్ వద్ద జడపాల మస్తానయ్య ఇంటి నుండి పంచాయితీ లిమిట్స్ వరకు "మట్టి మరియు గ్రావెలు రోడ్డు" వేయుట	10,000/-	500/-
11.	సరస్వతి నగర్‌లో N.పట్టాభిరామయ్య ఇంటి నుండి దేవరం కృష్ణారెడ్డి ఇంటి వరకు "మెటల్ రోడ్డు" వేయుట	13,500/-	675/-
12.	చిన్నపడుగుపాడు బ్రాంచిరోడ్డు నుండి ఆనందరావ్ హాస్టలు వరకు నున్న తారు రోడ్డు రిపేరు చేసి మరలా ఇంటి వరకు "మెటల్ రో" వేయుట	16,600/-	830/-
13.	చిన్నపడుగుపాడులో షేక్ బాషా మొహిదిన్ ఇంటి నుండి పడుగుపాడు ఆదెమ్మ ఇంటి వరకు "సిమెంటు రోడ్డు" వేయుట	17,500/-	875/-
14.	చిన్నపడుగుపాడులో వరాలశెట్టి రఘురామయ్య ఇంటి నుండి వల్లెపు రమణయ్య ఇంటి వరకు "మెటల్ రోడ్డు" వేయుట	20,000/-	1000/-
15.	పెద్దపడుగుపాడులో భట్టామస్తానయ్య ఇంటి నుండి రహీమ్ ఇంటి మీదుగ మసీదు వద్ద మెయిన్ రోడ్డు వరకు తారు రోడ్డు రిపేరు చేసి మరలా "తారురోడ్డు" వేయుట	20,000/-	1000/-
16.	పెద్దపడుగుపాడులో మసీదు వద్దనున్న "సైడుకాలువ రిపేర్లు వేయుట"	6,400/-	320/-
17.	చిన్నపడుగుపాడులో ముచ్చు ఆదెమ్మ ఇంటి నుండి పడమర వైపు మహిళా మండలి వరకు "సైడు కాలువ" నిర్మించుట	7,500/-	375/-
18.	పెద్దపడుగుపాడులో గోల్లప్రోలు లక్ష్మమ్మ ఇంటి నుండి శ్రీ రామ మందిరం వరకు "సైడు కాలువ" నిర్మించుట	9500/-	475/-
19.	కాటంరెడ్డి వారి మెయిన్ వీధిలో M. గోపాలరావ్ ఇంటి నుండి M.P.P. ప్రాథమిక పాఠశాల వరకు నున్న "సైడు కాలువ రిపేర్లు" చేయుట	9,700/-	485/-
20.	కాటంరెడ్డి వారి మెయిన్ వీధిలో సత్తార్ ఇంటి నుండి పారుదల కాలువ వరకు "సైడు కాలువ రిపేర్లు" చేయుట	11,500/-	575/-
21.	సత్యవతి నగర్ చివరి వీధిలో పడమర వైపున "కల్వర్టు" నిర్మించుట	1000/-	50/-
22.	చిన్నపడుగుపాడులో బి. ఆనందరావు ఇంటి నుండి గంగయ్య ఇంటి వరకు ప్రస్తుతమున్న "సైడుకాలువ రిపేర్లు" చేయుట	2,600/-	130/-
23.	సత్యవతి నగర్ చివరి వీధిలో తూర్పు వైపున "కల్వర్టు" నిర్మించుట	8500/-	425/-
24.	లక్ష్మి నారాయణ పురంలో GNT రోడ్డు నుంచి వచ్చు మెయిన్ రోడ్డులో "కల్వర్టు రిపేర్లు" చేయుట	18,000/-	900/-
25.	సరస్వతి నగర్ లో షేక్ ఇస్మాయిల్ ఇంటి నుండి వెలొట్టి చిన్నయ్య ఇంటి వరకు "సైడు కాలువ" నిర్మించుట	19,000/-	950/-
26.	నేతాజి నగర్‌లో అంగర అనంత లక్ష్మి ఇంటి సమీపమున వీధికి "R.C.C. సైపు కల్వర్టు" నిర్మించుట.	20,000/-	1000/-
27.	పెద్దపడుగుపాడులో సామూహ్ "బావి రిపేర్లు" చేయుట	1000/-	50/-
28.	గుడుంపావలీ దర్గా ప్రాంతములో నివశించు గిరిజనుల ఇండ్ల వద్ద "గొట్టపు బావి" వేయుట	2200/-	110/-
29.	వాగుమిట్ట ప్రాంతములో నున్న డీప్ బోరు వెల్ తొలగించి మరలా RF రోడ్డులో వేయుట	9,000/-	450/-
30.	చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీలోనున్న "చిన్న తరహా రక్షిత మంచి నీటి సరఫరా పథకము రిపేర్లు" చేయుట	10,000/-	500/-
31.	ఇనమడుగు జంక్షన్ సమీపమున శ్రీహరి రెడ్డి గోడౌన్సు వద్ద "గొట్టపు బావి" వేయుట	18,500/-	925/-
32.	G.N.T. రోడ్డులో N.T.S ముఖద్వారం వద్ద "బస్ షెల్టర్" నిర్మించుట	19,000/-	950/-
33.	N.H-5 బైపాసు రోడ్డులో చిన్నపడుగుపాడు బ్రాంచి రోడ్డులోకి పోవు జంక్షన్ వద్ద "బస్ షెల్టర్" నిర్మించుట	19,000/-	950/-

గమనిక: పడుగుపాడు గ్రామపంచాయితీలో రిజిష్టరు కంట్రాక్టరుగా చేరగోరువారు 6 నెలల లోపల తీసుకొన్న రూ. 50,000/- లకు తక్కువ గాని ఒరిజినల్ సాల్వెన్సీ సర్టిఫికెటు దాఖలు చేయవలెను. మరియు ఇంతకు పూర్వం చేరి సంవత్సరం పూర్తి కాని వారు కూడా అర్హులు.

బి. ఆదిశేషయ్య
కార్యనిర్వాహణాధికారి
పడుగుపాడు గ్రామ పంచాయితీ
కోవూరు మండలం, నెల్లూరు జిల్లా

శుభస్వీకరణ

నా ధర్మపత్ని

శ్రీ మతి చదలవాడ వెంకట సుబ్బమ్మ



అకాలమరణానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ తరలివచ్చిన అశేష బంధుమిత్రులకు మా కృతజ్ఞతా పూర్వక వందనములు తెలుపుకుంటూ

- 16.4.92 తేది గురవారం - నాయుడుపేటలోని మా స్వగృహమునందు కర్మక్రతువులు నిర్వహింపబడునని తెలియజేయడమైనది.

–చదలవాడ కృష్ణమూర్తి
నాయుడుపేట – తిరుపతి

చదలవాడ వెంకట శేషయ్య, రాధయ్య, వెంకటేశ్వర్లు – గూడూరు
నాగిశెట్టి వెంకటేశ్వర ప్రసాద్ – తిరుపతి
నాగిశెట్టి మురళీకృష్ణ – సూళ్లూరు పేట

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zamin Ryot Press, Nellore OFFSET printing at Nayagara Books Pvt. Ltd. Nellore.